# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానం గా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 124 గురువారం 29 జూన్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## ఆంధ్ర పిల్లలు ప్రపంచాన్ని ఏలాలి



**విజయనగరం:**

2022 -23 విద్యాసంవత్సరానికి అమ్మ ఒడి పథకం నిధులను సీఎం జగన్ విడుదల చేశారు. వరుసగా నాలుగో ఏడాది బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన కార్యక్రమంలో జగన్ 42.61లక్షల మంది తల్లుల ఖాతాల్లోకి రూ.6,392.94 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగానే ఏపీ సీఎం జగన్ మాట్లాడుతూ పది రోజుల పాటు పండుగల జగనన్న అమ్మ ఒడి కొనసాగుతుందని తెలిపారు.ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిందని జగన్ అన్నారు. నాలుగేళ్లలో కేవలం జగనన్న అమ్మఒడి పథకం ద్వారా రూ.26,067.28 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. విద్యా రంగంలో సంస్కరణలపై

03

## 57 శాతం మంది ఫస్ట్ ఛాయిస్ మోడీకే

**న్యూఢిల్లీ :**



2024 లోక్‌సభ ఎన్నికలు జరిగే ముందు ఈ ఏడాది పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ లిస్ట్‌లో మధ్యప్రదేశ్ కూడా ఉంది. ఇప్పటికే అన్ని పార్టీలూ ఎన్నికలకు సిద్ధమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా అక్కడ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. "మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్" అనే ప్రోగ్రామ్‌నీ మొదలు పెట్టారు. అయితే..మధ్యప్రదేశ్ ఓటర్లు ఎవరివైపు మొగ్గు చూపుతారన్న ఆసక్తి ఇప్పటికే మొదలైంది. దీనిపైనే ఏబీపీ సి ఓటర్ సర్వే ఓ ఒపినీయన్ పోల్ నిర్వహించింది. రకరకాల అంశాలపై అభిప్రాయాలు సేకరించిన ఈ సర్వే...ఓ ఆసక్తిర పోల్ చేపట్టింది. 2024 ఎన్నికల్లో ఎవరిని ప్రధాని అభ్యర్థిగా ఎన్నుకుంటారు..? అని ప్రశ్నించింది. వీరిలో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ, యోగి ఆదిత్యనాథ్, అరవింద్ కేజ్రీవాల్ పేర్లు ప్రధానంగా ఉన్నాయి. వీరిలో ఎవరు వచ్చే ఎన్నికల్లో ప్రధానిగా నిలబడాలని అనుకుంటున్నారని ప్రశ్నించగా ఆసక్తికర సమాధానాలు చెప్పారు ఓటర్లు. ఈ సర్వేలో దాదాపు 57% మంది నరేంద్ర మోదీకే ఓటు వేశారు. ప్రధాని అభ్యర్థిగా ఆయనే తమ ఫస్ట్ ఛాయిస్ అని తేల్చి చెప్పారు. ఈ రేసులో ఉన్న రాహుల్ గాంధీకి కూడా కొంత మద్దతు లభించింది. ఆయనకు 18% మంది ఓటు వేశారు. రాహుల్ ప్రధాని అవ్వాలని అభిప్రాయపడ్డారు. ఇక యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పీఎం రేసులో ఉన్నారని ఎప్పటి నుంచో వార్తలు వినిపిస్తున్నాయి. మోదీ తరవాతి ప్రధాని ఆయనే

03



### 12న తెలంగాణకు మోడీ

**హైదరాబాద్ :**

తెలంగాణలో నాలుగైదు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ప్రధాన పార్టీలన్నీ విజయం కోసం ఎప్పుడో ప్లాన్స్ అమలు చేస్తున్నాయి. వాటిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ట్రై చేస్తున్నారు. ముఖ్యంగా బీజేపీ అధినాయకత్వం తెలంగాణపై మరింత ఫోకస్ పెట్టింది. ఇప్పటికే రాష్ట్ర నాయకులను ఢిల్లీ పిలిచి మాట్లాడింది. ఇప్పుడు అగ్రనేతలు ఒక్కొక్కరుగా తెలంగాణలో పర్యటించబోతున్నారు. అందులో భాగంగా జులై 12 ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాబోతున్నారు. మహా జన్ సంపర్క్ అభియాన్?లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలంగాణలో పర్యటిస్తారు. ఆయన మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే రోడ్‌షో నిర్వహించబోతున్నారని సమాచారం. కర్ణాటక తరహాలోనే హైదరాబాద్ ?లో కూడా ప్రధాని మోదీ రోడ్ షో ఏర్పాట్లు చేస్తున్నట్లుగా బీజేపీ వర్గాలు తెలిపాయి. మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలో మోదీ రోడ్ షోతో పాటు సికింద్రాబాద్ లేదా హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో భారీ బహిరంగ సభ ఉంటుందని చెబుతున్నారు.

## బర్డ్ చరిత్రలో నూతన అధ్యాయం



03

## రాజ్యసభ ఎన్నికలకు నగారా

**న్యూఢిల్లీ :**

రాజ్యసభ ఎన్నికలకు నగారా మోగింది. వచ్చే నెల 24వ తేదిన పది రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. కేంద్రమంత్రి జై శంకర్ సహా పది మంది సభ్యుల పదవి కాలం పూర్తి కానుంది. అందుకోసమే ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీనికి సంబంధించి షెడ్యూ?ల్ విడుదల చేసింది. ఈ ఏడాది జులై-ఆగస్ట్ మధ్య గోవా, గుజరాత్, పశ్చిమ బెంగాల్ నుంచి 10 రాజ్యసభ




03

## ఉల్టా రథయాత్రలో అపశ్రుతి



03

## శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

**తిరుపతి**

అన్నమయ్య జిల్లా నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం 9 నుండి 10 గంటల మధ్య సింహ లగ్నంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అనంతరం ఆస్థానం ఘనంగా జరిగింది. శ్రీ సౌమ్యనాథస్వామి, ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో



03

# పేదల సంక్షేమమే మోడీ లక్ష్యం

**డా.బైరెడ్డి శబరి**

**ప్రజా తపన ,నంద్యాల :**




దేశంలో పేద ప్రజల సక్షేమమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యం అని బీజేపీ నంద్యాల పార్లమెంట్ ఇంచార్జి డా.బైరెడ్డి శబరి బుధవారం అన్నారు. నంద్యాల జిల్లా మహాజన సంపర్క్ బహిరంగ సభను విజయవంతం చేసిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ బుదవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తుందన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులతో రాష్ట్ర ప్రభుత్వం తామే ఇస్తున్నట్లు స్టిక్కర్లు వేసుకోవడం సిగ్గుచేటన్నారు. దేశ అభివృద్ధి కోసం పాటు పడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం వెంట నడవాలని ఆమె కోరారు. 9 ఏళ్ల నరేంద్ర మోడీ నాయకత్వంలోని బి జె పి పాలన దేశం కోసం సేవచేయడం, సుపరిపాలన అందించడం, పేదల సంక్షేమం ధ్యేయంగా అవినీతి రహిత పాలన కొనసాగిస్తున్నారు నంద్యాల జిల్లా మహాజన సంపర్క్ బహిరంగ సభకు హాజరైన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురంధేశ్వరికి , నంద్యాల జిల్లా నాయకులకు, కార్యకర్తలకు, ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు

# ఆస్తి పన్ను చెల్లింపుకు జూన్ 30 గడువు

**గుత్తి మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులు**

**గుత్తి ( ప్రజా తపన )**



జూన్ 28 మున్సిపాలిటీ పుర ప్రజలకు తెలియజేస్తూ ఆస్తి పన్ను పై వడ్డీ లేకుండా చెల్లించడానికి 2 రోజులే గడువు ఉందని, పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వడ్డీ లేకుండా పన్ను చెల్లించాలని నగర కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2023-24 మొదటి అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లించడానికి ఈ నెలాఖరు వరకే గడువు ఉందని, జూలై 1 నుండి పన్ను బకాయి పై రూ.100 కి రూ.2 వడ్డీ పడుతుందన్నారు

ఇప్పటికే డిమాండ్ నోటీసులు సచివాలయాల వారీగా పంపిణీ చేయడం జరిగిందని, ఎవరికైనా అందకుంటే అందుబాటులో వున్న వార్డ్ సచివాలయం అడ్మిన్ కార్యదర్శి ద్వారా తీసుకోవచ్చని పేర్కొన్నారు

ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థల పన్నులు పురపాలక సంఘం కార్యాలయంలో పన్ను చెల్లించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ పన్నులు సకాలంలో చెల్లించి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కమీషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు

# రాజ్యసభ ఎన్నికలకు నగారా

(మొదటిపేజీ తరువాయి)

స్థానాలు ఖాళీ కానున్నట్లు తెలిపింది. అయితే పశ్చిమబెంగాల్ ఆరు స్థానాలకు ఎన్నికలు జరగనుండగా.. గుజరాత్‌లో మూడు, గోవాలో ఒక స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ స్థానాలకు సంబంధించి జులై 6న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. జులై 13 వరకు నామినేషన్లు వేసుకోవచ్చని.. ఉపసంహరణకు జులై 17న చివరి తేది అని పేర్కొంది.ఇక చివరగా 24వ తేదిన ఉదయం 10 గంటల వరకు నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుందని తెలిపింది. అలాగే ఫలితాలు కూడా అదే రోజున ప్రకటించనున్నట్లు స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా గత ఏడాది జులైలో రాజ్యసభ ఎన్నికలు జరిగాయి. ఇందులో బీజేపీ 8 స్థానాల్లో గెలిచింది. రాజస్థాన్‌లో కాంగ్రెస్‌కు మూడు రాగా..రాజస్థాన్, మహారాష్ట్రలో ఒక్కో స్థానంలో గెలిచింది. అలాగే పశ్చిమ బెంగాల్‌లోని ఒక రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక జరగనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. గోవా మాజీ సీఎం లుజిన్హో ఫలేరో తన స్థానానికి, తృణమూల్ కాంగ్రెస్‌కు రాజీనామా చేయడంతో ఆ స్థానం ఖాళీ అయినట్లు పేర్కొంది.

# ఉల్టా రథయాత్రలో అపశ్రుతి



**అగర్తలా:** ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో ఘోర విషాదం చోటుచేసుకుంది. ఉన్‌కోటి జిల్లాలోని కుమార్‌ఘాట్‌లో జరిగిన ఉల్టా రథయాత్రలో విద్యుదాఘాతం జరగడంతో ఇద్దరు చిన్నారులు సహా ఏడుగురు మృత్యువాతపడ్డారు. మరో 15మంది గాయపడ్డారు. బాధితులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కుమార్ ఘాట్ ప్రాంతంలో జగన్నాథుడికి నిర్వహించిన రథయాత్రలో బుధవారం సాయంత్రం 4.30గంటల సమయంలో రథం పైభాగం హైటెన్షన్ వైర్లను తాకడంతో మంటలు వ్యాపించి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో వేలాదిమంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నట్టు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై త్రిపుర సీఎం మానిక్ షా స్పందించారు. కుమార్‌ఘాట్‌లో జరిగిన ఈ దుర్ఘటన తీవ్ర విచారకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులంతా త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని తెలిపారు.

# ఆంధ్ర పిల్లలు ప్రపంచాన్ని ఏలాలి

(మొదటిపేజీ తరువాయి)

అక్షరాలా రూ.66,722.36 కోట్లను వినియోగించామన్నారు. నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో మరెప్పుడూ చూడని విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామని తెలిపారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనలో ఉన్న ఆయన.. కురుపాంలో నాలుగో విడత అమ్మ ఒడి కార్యక్రమాన్ని ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఇరవై ఆరువేల కోట్లు ఇప్పటి వరకు ఈ పథకానికి ఇవ్వడం జరిగింది అని వెల్లడించారు.. ఇదంతా మధ్యవర్తుల ప్రమేయం లేకుండానే లబ్ధిదారులకు నేరుగా అందింది.. పిల్లల భవిష్యత్తు కోసం.. బడికి పిల్లలను పంపించేందుకు ఆ తల్లులకు ఇచ్చే ప్రోత్సాహకం ఇది? దేశంలో మరెక్కడా జరగటం లేదు? ఒక్క మన రాష్ట్రంలోనే జరుగుతోంది అన్నారు.. నాలుగేళ్లలో రాష్ట్రంలో మరెప్పుడూ చూడని విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామని వెల్లడించారు.. ప్రపంచాన్ని ఏలే పరిస్థితికి మన పిల్లలు రావాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఇందులో భాగంగా పదిరోజులపాటు పండుగలా జగనన్న అమ్మ ఒడి నిర్వహిస్తాం అని తెలిపారు.ఇక, నన్ను గుండెల్లో పెట్టుకున్న ప్రతీ ఒక్కరికి నిండు మనసుతో.. హృదయపూర్వక కృతజ్ఞతలంటూ తన ప్రసంగం ప్రారంభించారు సీఎం వైఎస్ జగన్. తల్లులు తమ పిల్లలను బడులకు పంపేందుకు అమ్మ ఒడి పథకం తీసుకొచ్చాం. ఈ నాలుగేళ్లలో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. గతంలో.. క్లాస్ టీచర్లకే గతిలేని పరిస్థితి గతంలో చూశాం. ఇప్పుడు మూడో తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్లు ఉండేలా చేస్తున్నాం. మన పిల్లలు గ్లోబల్ సిటిజన్స్‌గా తయారు కావాలి అని సీఎం జగన్ వేదిక నుంచి ఆకాంక్షించారు. మూడో తరగతి నుంచే టోఫెల్ కరికులమ్ తీసుకొస్తున్నాం. ఆరో తరగతి నుంచే క్లాస్‌ను డిజిటలైజ్ చేస్తున్నాం అని తెలిపారాయన. ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం, విద్యాకానుక కిట్లు అందించడం, మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లు.. టోఫెల్ కోసం మూడు నుంచే ప్రత్యేక తరగతులు ఇలా ఎన్నో విప్లవాత్మక మార్పులు చేశాం అన్నారు.గతంలో పెత్తందార్లకే అందుబాటులో ఉన్న చదువులు .. ఇప్పుడు పేదలకు కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు సీఎం జగన్.. పెత్తందారీ విద్యావిధానాన్ని బద్దలు కొట్టి.. అన్నివర్గాలకు ఉన్నతవిద్యను అందిస్తున్నామన్నారు. పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేలా ప్రభుత్వ బడులని తీర్చిదిద్దాం. ప్రైవేట్ బడులతో ప్రభుత్వ బడులు పోటీపడే పరిస్థితికి చేరుకుంది. చదువుల్లో అంటరానితనాన్ని రూపుమాపాం. ప్రభుత్వ బడుల్లోనూ వజ్రాలు, రత్నాల్లాంటి పిల్లలు ఉండాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం అని పేర్కొన్నారు.. ప్రపంచాన్ని ఏలే పరిస్థితికి మన పిల్లలు రావాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. అంగన్వాడీలలో గర్భిణీ లకు సంపూర్ణ పౌష్టికాహార అందిస్తున్నాం.. 45 వేల ప్రభుత్వ స్కూలలో నాడు నేడు ద్వారా మార్పులు చేస్తున్నాం.. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్య అందిస్తూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకూ ట్యాబ్ లను అందిస్తున్నాం.. విద్యార్థులకు తొలిసారిగా బైలింగ్యువల్ పుస్తకాలు కూడా ఇచ్చామన్నారు. వంద శాతం పూర్తి ఫీజు రీయంబర్స్ మెంట్ జగనన్న విద్యా దీవెన అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలో మాత్రమే అమ్మఒడి అమలు అవుతుందని స్పష్టం చేశారు. విదేశాల్లో పెద్ద చదువుల కోసం విద్యార్థులకు ఎక్కడ సీటు వచ్చినా.. కోటి 25 లక్షల అందజేస్తున్నామన్నారు. బడులు ప్రారంభం అయిన వెంటనే మెరుగైన విద్యా కానుక కిట్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు.

# 57 శాతం మంది ఫస్ట్ ఛాయిస్ మోడీకే

(మొదటిపేజీ తరువాయి)

అన్న ఊహాగానాలూ మొదలయ్యాయి. ఈ క్రమంలోనే ఈ సర్వేలో ఊహించని ఫలితాలు వచ్చాయి. యోగి ఆదిత్యనాథ్ ప్రధాని అభ్యర్థిగా ఉండాలని కేవలం 8% మంది మాత్రమే భావించారు. ఇక అరవింద్ కేజ్రీవాల్‌కి 3% మంది ఓటు వేశారు. ఇతరులకు 14% మేర ఓట్లు దక్కాయి. నరేంద్ర మోదీ - 57%రాహుల్ గాంధీ - 18%యోగి ఆదిత్యనాథ్ - 8%కేజ్రీవాల్ - 3%ఇతరులు - 14%ఇదే ఒపీనియన్ పోల్‌లో మరో అంశంపైనా సర్వే జరిగింది. ఒకవేళ ప్రధానిని నేరుగా ఎన్నుకోవాల్సిన అవకాశం వస్తే ఎవరికి మొగ్గు ఎక్కువగా ఉంటుందని సర్వే నిర్వహించారు. ఇందులోనూ నరేంద్ర మోదీకే ఎక్కువ ఓట్లు దక్కాయి. దాదాపు 68% మంది ఓటర్లు "మాకు ప్రధానిని ఎన్నుకునే అవకాశం వస్తే మోదీనే ఎన్నుకుంటాం" అని తేల్చి చెప్పారు. 29% మంది రాహుల్ గాంధీ పేరు చెప్పారు. సర్వేలో పాల్గొన్న వారిలో 3% మంది మాత్రం ఏ సమాధానమూ చెప్పలేదు. గతంలోనూ ప్రధాని అభ్యర్థిపై పలు సర్వేలు జరిగాయి. దాదాపు అన్నింట్లోనూ మోదీకే ఎక్కువ మంది మొగ్గు చూపించారు. ఈ రేసులో రెండో స్థానంలో ఉన్నారు రాహుల్ గాంధీ. ఇప్పటి వరకైతే కాంగ్రెస్..రాహుల్ గాంధీని ప్రధాని అభ్యర్థిగా అధికారికంగా ప్రకటించలేదు. కీలక నేతలు కూడా ఎప్పుడూ ప్రస్తావించలేదు. కానీ...ప్రధాని ప్రస్తావన వచ్చిన ప్రతిసారీ రాహుల్ గాంధీ పేరు కూడా వినిపిస్తూ వస్తోంది.

# బర్డ్ చరిత్రలో నూతన అధ్యాయం

**- జూన్ 30 నుండి జూలై 2వ తేదీ వరకు ఆపరేటివ్ ఆర్థో ప్లాస్టీ సమ్మిట్ " పేరుతో లైవ్ సర్జరీలు**

**- దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ఆర్థో డాక్టర్ల హాజరు**

**తిరుపతి జూన్ 28**

బర్డ్ ఆసుపత్రి చరిత్రలో నూతన అధ్యాయానికి తెర లేవనుంది. జూన్ 30వ తేదీ నుండి జూలై 2వ తేదీ వరకు " ఆపరేటివ్ ఆర్థో ప్లాస్టీ సమ్మిట్ " పేరుతో లైవ్ సర్జరీలు నిర్వహించే కార్యక్రమం నిర్వహించబోతోంది. టీటీడీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయని ఆసుపత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. బర్డ్ ఆసుపత్రిలో గత నాలుగేళ్ళుగా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. రోగులకు అత్యాధునిక వైద్య సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్యం అందించడానికి కోట్ల రూపాయల ఖర్చుతో ఆధునిక స్కానర్లు, ఎక్స్ రే మిషన్లు, సి టి స్కానర్లు లాంటి అనేక యంత్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. రోగులకు అందుబాటులో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి దాన్ని కూడా ఆధునీకరించారు. బర్డ్ ఆసుపత్రికి వచ్చే రోగులకే కాకుండా బయటి ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్న రోగులకు కూడా తక్కువ ఖర్చుకే సిటి, ఎక్స్ రే, రక్త పరీక్షలు చేసే సదుపాయం అందుబాటులోకి తెచ్చింది. ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నే లా వసతులు కల్పించి పేదలకు ఉచితంగా సర్జరీలు చేస్తూనే, సొమ్ము చెల్లించి సర్జరీ చేయించుకునే శక్తి ఉన్న వారికి తక్కువ ధరకే మోకీలు మార్పిడి, ఇతర ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి నిర్వహణలో అనేక మార్పులు తీసుకుని వచ్చి ఆన్లైన్, ఫోన్ ఎస్ ఎం ఎస్ ద్వారా కూడా ఓపి సేవలు పొందే సదుపాయం ఏర్పాటు చేయడం జరిగింది. బర్డ్ వైద్య సేవలకు ప్రజల నుండి వస్తున్న స్పందన చూసి వైద్య సేవలు మరింత విస్తృతం చేయాలని టీటీడీ నిర్ణయించింది.లైవ్ సర్జరీలు ఎందుకంటే... బర్డ్ ఆసుపత్రిలో ప్రపంచ స్థాయి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. దేశంలోని ప్రముఖ వైద్యులు వచ్చి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్లను ఆసుపత్రి వైద్యులతో పాటు దేశంలోని ఆర్థో వైద్యులు చూసి అవగాహన పెంచుకోవడానికి ఈ సమ్మిట్ ఉపయోగపడుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్ లో దేశంలోని టాప్ 20 ఆర్థో వైద్య నిపుణులు లైవ్ లో సర్జరీలు చేస్తారు.

ఇప్పటిదాకా నమోదు చేసుకున్న సుమారు 200 మంది వైద్యులు బర్డ్ ఆసుపత్రి లోని ఆధునిక ఆపరేషన్ థియేటర్లో జరిగే సర్జరీలను ఫార్చ్యూన్ గ్రాండ్ రిడ్జ్ హోటల్ లో వీక్షిస్తారు. సర్జరీకి సంబంధించి తమకు తెలియని విషయాలను సర్జరీ చేస్తున్న ప్రముఖ వైద్యులను అడిగి తెలుసుకోవచ్చు. బర్డ్ చరిత్రలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వైద్యుల నుండి వచ్చిన స్పందన దృష్ట్యా స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కూడా కల్పించాలని బర్డ్ ట్రస్ట్ నిర్ణయించింది. డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దీపక్ పర్యవేక్షణలో సమ్మిట్ ఏర్పాట్లన్నీ పూర్తి అయ్యాయని డాక్టర్ రాచపల్లి రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. ఫార్చ్యూన్ గ్రాండ్ రిడ్జ్ హోటల్ లో జూన్ 30 వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి సమ్మిట్ ను ప్రారంభిస్తారు. జేఈవో సదా భార్గవి ఇతర అధికారులు పాల్గొంటారు.

# శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

(మొదటిపేజీ తరువాయి)

విహరించారు. ఈ ఊరేగింపు ద్వారా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ముందుగా పర్యవేక్షిస్తారని ప్రతీతి. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథ స్వామి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని ఉద్దేశం.

రూ. 50 లక్షలతో వసతుల కల్పన :

జేఈవో సదా భార్గవి

ఈ సందర్భంగా జేఈవో సదా భార్గవి మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు . మూలవిరాట్‌తోపాటు వాహనసేవలను భక్తులు సంతృప్తిగా దర్శించుకునేందుకు వీలుగా విస్తృతంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో మౌళిక వసతుల కల్పనకు రూ.50 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్పారు. త్వరలో ఆర్కియాలజి డిపార్టుమెంటు అనుమతులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఈవో నటేష్ బాబు, సూపరింటెండెంట్ వెంకటేశయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వాహనసేవలు జరుగుతాయి.

వాహనసేవల వివరాలు :

తేదీ28-06-2023 రాత్రి - యాలి వాహనం

29-06-2023 ఉదయం - పల్లకీ సేవరాత్రి - హంస వాహనం

30-06-2023 ఉదయం - పల్లకీ సేవ రాత్రి - సింహ వాహనం

01-07-2023 ఉదయం - పల్లకీ సేవ రాత్రి - హనుమంత వాహనం

02-07-2023ఉదయం - శేష వాహనం రాత్రి - గరుడ వాహనం

03-07-2023ఉదయం - సూర్యప్రభ వాహనం రాత్రి - చంద్రప్రభ వాహనం

04-07-2023ఉదయం - ఆర్జిత కల్యాణోత్సవం (ఉదయం 10 గంటలకు) రాత్రి - గజ వాహనం

05-07-2023ఉదయం - రథోత్సవం (ఉదయం 9 గంటలకు) రాత్రి - అశ్వవాహనం

06-07-2023ఉదయం - చక్రస్నానం రాత్రి - ధ్వజావరోహణం

జూలై 4వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.500/- చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదాలు బహుమానంగా అందజేస్తారు. జూలై 7న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# వేలిముద్రల ద్వారా డబ్బులు మాయం

**నెల్లూరు :**

నెల్లూరు జిల్లాలో సరికొత్త మోసం వెలుగు చూసింది. అకౌంట్లలోనుంచి డబ్బులు మాయమైపోతోందంటూ బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టారు. చివరకు పరిశోధించి విషయం తేల్చారు. వేలిముద్రల ద్వారా డబ్బులు మాయం అవుతున్నట్టు గుర్తించారు. మరి బాధితులు వేలిముద్రలు వేయకుండానే ఇదంతా ఎలా జరుగుతోంది, ఆ డబ్బు ఎక్కడికెళ్తోంది, అసలా నిందితుల ప్లాన్ ఏంటి..?ఇదో సరికొత్త మోసం, మనకు తెలియకుండానే మన వేలిముద్రలు దొంగిలించి, మన ఆధార్ కార్డ్ ద్వారా మనకు సంబంధం లేకుండానే మన అకౌంట్లనుంచి డబ్బులు మాయం చేస్తున్నారు కేటుగాళ్లు. ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ ద్వారా ఈ మోసం జరుగుతోంది. ప్రస్తుతం పల్లెటూళ్లలో బ్యాంకింగ్ కియోస్క్ లు ఏర్పాటు చేసి, ఆధార్ నెంబర్ చెప్పి, వేలిముద్ర వేస్తే డబ్బులు విత్ డ్రా చేసి ఇస్తారు, కొంత కమిషన్ తీసుకుంటారు. అయితే దీన్ని అడ్డు పెట్టుకుని, అకౌంట్ హోల్డర్లకు తెలియకుండా డబ్బులు కాజేస్తున్నారు కొంతమంది. ఇలాంటి ఓ ముఠాను నెల్లూరు జిల్లా పోలీసులు పట్టుకున్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో భూముల రిజిస్ట్రేషన్ల సమయంలో వేసే వేలి ముద్రలను దొంగిచించి వాటి ద్వారా వేలిముద్రల కాపీలు తయారు చేసి బ్యాంకుల్లో డబ్బులు కొట్టేస్తున్నారు. ఆధార్ నెంబర్లు కూడా రిజిస్ట్రార్ ఆఫీసుల్లోనుంచే దొంగిలించారు. ఈ ముఠా ఇప్పటి వరకూ 51 లక్షల 25వేల రూపాయలు ఇలా దొంగిలించినట్టు గుర్తించారు. బాధితుల బ్యాంక్ అకౌంట్లనుంచి తమ వ్యాలెట్ లోకి డబ్బులు ట్రాన్స్ ఫర్ చేసుకుంటున్న నిందితులు, వెంటనే దాన్ని విత్ డ్రా చేసుకుంటున్నారు. దీంతో రికవరీ కష్టసాధ్యంగా మారింది. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్ కి సంబంధించి డాక్యుమెంట్ రైటర్ గా పనిచేసే ఓ వ్యక్తి ఇందులో కీలక నిందితుడు. రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్ పనులకోసం వచ్చేవారు, సాక్షులుగా సంతకాలు చేసేవారు వేలిముద్రలు వేయడం, తమ ఆధార్ కాపీలు ఇవ్వడం పరిపాటి. దీని ద్వారా ఈ కేటుగాళ్లు వేలిముద్రలు, దానికి సంబంధించిన ఆధార్ కాపీలు స్కాన్ చేసేవారు. అలా స్కాన్ చేసిన వేలిముద్రలతో బ్యాంకింగ్ కియోస్క్ టెక్నాలజీతో డబ్బులు కాజేసేవారు. బాధితుల్లో ఎక్కువమంది నిరక్షరాశ్యులు, పల్లెటూరివారే ఉన్నారు. ఎప్పటికప్పుడు సెల్ ఫోన్ లో బ్యాంక్ నుంచి వచ్చే మెసేజ్ లు చూడటం వారికి అలవాటు లేదు. అందుకే బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు ట్రాన్స్ ఫర్ అయినా కూడా వారికి తెలియదు. దీంతో ఈ కేటుగాళ్ల పని సులభమైంది. తీరా ఓ బాధితుడి ఫిర్యాదుతో నెల్లూరు పోలీసులు తీగలాగి, డొంక కదిలించారు. ఇక్కడ నెల్లూరు జిల్లావారు బాధితులే అయినా, 10మంది నిందితులు జిల్లా బయటి వ్యక్తులు కావడం విశేషం. ఇతర జిల్లాల్లో వీరు పనులు చక్కబెట్టారు. ఆన్ లైన్ నుంచి కూడా కొంత డేటా సేకరించారని పోలీసులు అనుమానిస్తున్నారు. వ్యాలెట్ లో ఉన్న సొమ్మని బ్లాక్ చేశామని, మిగతా సొమ్ము నిందితులనుంచి రికవరీ చేస్తామని చెబుతున్నారు పోలీసులు. ఇలాంటి మోసాలను నివారించాలంటే ఆధార్ తో అనుసంధానంగా ఉన్న ఫింగర్ ప్రింట్ ని డిజేబుల్ చేసుకోవాలని సలహా ఇస్తున్నారు. అలా చేస్తే మన వేలిముద్ర ఎవరికీ కనపడదని, వేలిముద్రలతో మన ఆధార్ ని ఎవరూ ఉపయోగించలేరని చెప్పారు.

# డిజిటల్ ఎనర్జీ మైనింగ్ పేరుతో మోసం

**విజయవాడ :**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలో మరో మోసం బట్టబయలైంది. కొందరు కేటుగాళ్లు డిజిటల్ ఎనర్జీ మైనింగ్ ఆన్‌లైన్ యాప్ పేరుతో ప్రజల్ని మోసం చేశారు . వారిని నమ్మి చైన్ లింక్ పద్ధతిలో ఆన్‌లైన్ యాప్ ద్వారా కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామానికి చెందిన 800 మందికి పైగా సభ్యులు పెట్టుబడులు పెట్టారు . ఒక్క పెండ్యాల గ్రామంలోనే 5 కోట్లకు పైగా లావాదేవీలు చేశారు. చండీగఢ్ నుంచి పెండ్యాల గ్రామానికి చెందిన వ్యక్తి ద్వారా లింక్ రావడంతో నమ్మి పెట్టుబడులు పెట్టారు గ్రామస్తులు. లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే రెండు లక్షలు వస్తాయని నమ్మించారు. ఇంకేముంది.. పెట్టినదానికి డబుల్ వస్తాయనుకుని.. కోట్లలో పెట్టుబడులు పెట్టారు. స్థాయిని బట్టి లావాదేవీలు చేసిన గ్రామస్తులు.. వేలతో మొదలు పెట్టి లక్షల్లోనూ ట్రాన్సాక్షన్లు నిర్వహించారు.మొదట్లో లావాదేవీలు బాగానే నడిచాయి. ఆ తర్వాత డబ్బులు తిరిగి వచ్చే సమయానికి యాప్ పనిచేయకుండా పోయింది. 16వ తేదీ నుంచి డిజిటల్ ఎనర్జీ మైనింగ్ పేరుతోనున్న యాప్ పనిచేయకపోవడంతో తాము మోసపోయినట్లు బాధితులు గుర్తించారు . యాప్ పనిచేయకపోవడంతో పెట్టుబడులు బాధితులు లబోదిబోమని మొత్తుకుంటున్నారు. అధిక డబ్బులు వస్తాయని.. అత్యాశకు పోయి.. నిండా మునిగామంటూ ఆవేదన చెందుతున్నారు. అయితే.. లక్షల్లో నష్టపోయినా.. మోసాన్ని బయటకు చెప్పేందుకు మాత్రం సాహసించడం లేదు బాధితులు. కొందరు మాత్రం.. తమలా మరెవరూ మోసపోవద్దని సూచిస్తున్నారు. ఇక.. డిజిటల్ ఎనర్జీ మైనింగ్ ఆన్‌లైన్ యాప్ నిర్వాహకుల మోసంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మొత్తంగా.. లోన్ యాప్ మోసాలు నగరాలు, పట్టణాల నుంచి గ్రామాలకు చేరడం కలవరపెడుతోంది.

# ఉభయగోదావరి జిల్లాల కోసం మాస్టర్ ప్లాన్

**కాకినాడ :**

వారాహి విజయ యాత్రను ప్రారంభించామని ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సంకేతాలను పరిశీలిస్తే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బలంగా అర్థమవుతుందన్నారు. 2008 నుంచి రాజకీయ ప్రస్థానంలో ముందుకు వెళు తున్నామన్నారు. మార్పు వచ్చే వరకు దాన్ని వదలకూడదని పట్టుదలతో ఉన్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. ఎన్ని లక్షలు పోసినా సభలకు ఇంత మంది రారని. రాజోలులో స్వచ్ఛందంగా మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారన్నారు. మార్పు మొదలైందన్న దానికి ఇదే సంకేతం అని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.ఇసుక రీచ్‌లో అడ్డగోలుగా జరిగిన దోపిడీ వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఆదాయం పోకుండా కాలుష్యాన్ని పారద్రోలాలని, ఉభయ గోదావరి జిల్లాల అభివృద్ధి కోసం ఒక మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. అందులో ముఖ్యమైన అంశం కాలుష్య నివారణ అని. ఆక్వా కల్చర్ వల్ల ఆదాయంతోపాటు ఆపద ఉందన్నారు. ఆదాయం పోకుండా కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలు చేయాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.'తూర్పు గోదావరి జిల్లాలో గ్రామాల్లో కూడా నీరు పచ్చగా వస్తోంది. ఇలాంటి పరిస్థితులు కిడ్నీలు లాంటి అవయవాలను దెబ్బతీస్తున్నాయి. ఉద్దానం లాంటి పరిస్థితులు ఉభయ గోదావరి జిల్లాల్లోనూ వచ్చేస్తున్నాయి' అని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పచ్చదనం దెబ్బ తినకుండా ప్రజలు ఉపాధి అవకాశాలు కోల్పోకుండా ఆదాయం రావాలని, దాని కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని జనసేనాని తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్న దివ్య క్షేత్రాలను అనుసంధానం చేసే విధంగా డివోషనల్ సర్క్యూట్ రూట్ ఏర్పాటు చేసి పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. నరసాపురంలో కాలువలు ఉన్నా కేరళ తరహా పర్యాటకం అభివృద్ధి చేయలేకపోతున్నామని, బలమైన వ్యూ ఉంటేనే అది సాధ్యమవుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు.జనసేన నేతలు, జనసైనికుల ఆత్మగౌరవాన్ని ఎట్టి పరిస్థితుల్లో తాకట్టు పెట్టనని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. మన దగ్గర పెట్టుబడి పెట్టే వారు లేరన్న ఆయన ముఖ్యమంత్రికి , నాయకులకు కాంట్రాక్టులు , అక్రమార్జనలు ఉన్నాయన్నారు. 'నేను ఒక వ్యవస్థ నడుపుతున్నాను. నాకు అలాంటి అక్రమార్జన ఉంటే ముందుకు వెళ్లగలిగేవాడిని కాదు. నేను పార్టీ నడుపుతూ ఇన్నాళ్లు దెబ్బలు తిన్నాను తప్ప మీ ఆత్మగౌరవాన్ని ఎక్కడా తాకట్టు పెట్టలేదు. ఇప్పటి వరకు రాజకీయాల్లో ప్రలోభాలకు చోటివ్వకుండానే ఉన్నాం. ఎన్ని లక్షల కోట్లు ఇచ్చినా ఇంత అభిమానం రాదు. ఇవన్నీ డబ్బుతో కొనేవి కాదు. తెలంగాణ , తమిళనాడు , కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లినా ఇదే స్థాయి అభిమానం ఉంటుంది. ఆ అభిమాన బలంతో ముందుగా ప్రజా సమస్యల పరిష్కారం మీద దృష్టి సారించాను. తర్వాత పార్టీ నిర్మాణం వైపు అడుగులు వేశాం.' అని పవన్ కల్యాణ్ తెలిపారు.జనసేన ప్రభుత్వంలో యూకే తరహా హెల్త్ పాలసీ తీసుకువస్తామన్న పవన్ కల్యాణ్ దీనిపై లోతుగా అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. దాతలు ఇచ్చిన కాలేజీ స్థలాలు కూడా అన్యాక్రాంతం అవుతున్నాయని మండిపడ్డారు. పెద్దలు భావితరాల భవిష్యత్తు కోసం ఇచ్చిన భూములు దోచుకుంటున్న వారికి ప్రభుత్వాలు అండగా నిలిచినప్పుడు లక్ష్యాలు దెబ్బతింటాయని చెప్పారు. 'ప్రభుత్వ స్కూళ్లు , కళాశాలలను బలోపేతం చేయాలి. ఉపాధి అవకాశాలు ఉండాలి. ఇక్కడ ఐటీ పరిశ్రమలు లేవు. తెలంగాణలో 1500 , కర్ణాటకలో 2000 ఐటీ హబ్బులు ఉంటే .. మన రాష్ట్రంలో ఆ స్థాయిలో ఎందుకు లేవు. ఇది మన నేల అన్న తపన ఉన్న నాయకులు పూనుకుంటేనే అది సాధ్యపడుతుంది. మనం నోరెత్తకపోతే సమాజం నాశనం అయిపోతుంది. అందుకే నేను ఉభయ గోదావరి జిల్లాల బాధ్యత స్వీకరించాజ.' అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# అనంత టీడీపీలో కుమ్ములాటలు

**అనంతపురం:**

తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ లో దూసుకుపోవాలని అనుకుంటూ ఉంది. కానీ ఆయా నియోజకవర్గాల్లో ఉన్న గొడవల కారణంగా ఈ ఎన్నికల్లో కూడా చతికిల పడే అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ముఖ్యంగా వర్గపోరు తెలుగుదేశం పార్టీని ఊహించని విధంగా వెనక్కులాగుతూ ఉంది. ఏ నియోజకవర్గంలో చూసినా.. మాజీ టీడీపీ ఎమ్మెల్యేలకు.. కొత్తగా పార్టీలోకి వచ్చి ఎదిగిన నేతలకు పొసగడం లేదు. శ్రీకాకుళం నుండి చిత్తూరు జిల్లా వరకూ ఇదే కొనసాగుతూ ఉంది. తెలుగుదేశం పార్టీకి కంచుకోట అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే వాతావరణమే కనిపిస్తూ ఉంది. అందుకు పెనుగొండ నియోజకవర్గం మినహాయింపేమీ కాదు. ఏపీలో ప్రతిష్టాత్మకంగా టీడీపీ బస్సు యాత్రలు చేపట్టింది. ఈ యాత్రలలో విభేదాలు భగ్గుమంటున్నాయి. పార్టీలో ఆధిపత్యం కోసం తెలుగు తమ్ముళ్లు ఒకరికొకరు కొట్టుకుంటున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ టీడీపీ లో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర పెనుకొండకు చేరుకుంది.ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎప్పటి నుండో పెనుగొండ నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు రెండు వర్గాలుగా చీలిపోయారు. సవితమ్మ, బీకే పార్థసారధి వర్గాల మధ్య ఘర్షణ ఉన్న వైరం తాజాగా బయటపడింది. జై బీకే అని.. ఓ వర్గం నినాదాలు చేస్తే.. జై సవితమ్మ అంటూ మరో వర్గం నినాదాలతో పెనుగొండ ఎన్టీఆర్ సర్కిల్ మారుమోగింది. వెంటనే తెలుగు తమ్ముళ్లు ఒకరినొకరు తన్నుకున్నారు. రెండు వర్గాలను అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. అలా పెనుగొండ నియోజక వర్గంలో గ్రూపు తగాదా బయటకు వచ్చింది. రాబోయే రోజుల్లో ఇంకా ఎన్ని గొడవలు చూస్తామో ఈ రెండు వర్గాల మధ్య అని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అనుకుంటూ ఉన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో జులై 2 టెన్షన్

**హైదరాబాద్:**

కర్నాటక ఫలితాలతో జోష్ మీదున్న తెలంగాణ కాంగ్రెస్‌కు ఇప్పుడు కొత్త టెన్షన్ మొదలైంది. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్రతో ఆ పార్టీకి మరింత ఊపొచ్చింది. జూలై 2వ తేదీన భట్టి పాదయాత్ర ఖమ్మంలో ముగుస్తుంది. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించి, ముఖ్యఅతిథులుగా రాహుల్, ప్రియాంకగాంధీలను ఆహ్వానించాలని భావిస్తోంది. ఇక్కడివరకూ బాగానే ఉంది. అయితే, అదే రోజు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. గత మూడు నాలుగు నెలల నుంచి మండుటెండల్లో భట్టి పాదయాత్ర నిర్వహించి, పార్టీని అధికారంలోకి తేవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు.ఈ సమయంలో భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపుగా ప్రత్యేక సభ ఉండాల్సిందేనని సీనియర్ నేతలు పట్టుబడుతున్నారు. భట్టికి మైలేజ్ వెళ్లకుండా మమ అనిపిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవర్గం నేతలు మాత్రం పొంగులేటి సభలోనే భట్టిని సన్మానిస్తే సరిపోతుందని భావిస్తున్నారు. అయితే, భట్టి పాదయాత్ర ముగింపు సభకు రాహుల్ లేదా ప్రియాంకగాంధీ హాజరయ్యే ఛాన్స్ ఉంది. ఈ విషయంపై నిన్న కాంగ్రెస్ స్ట్రాటజీ మీటింగ్‌లో కూడా చర్చ జరిగింది. అదే సమయంలో ఖమ్మంలో భట్టి ముగింపు సభ, పొంగులేటి చేరిక విషయాన్ని కూడా కొందరు సీనియర్ నేతలు అధిష్ఠానం దృష్టికి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.పీపుల్స్ మార్చ్ వర్సెస్ పొంగులేటి చేరికగా రెండు వర్గాలుగా మారిపోయాయి. దాంతో రాహుల్ కంప్లయింట్స్ వద్దే వద్దు.. పార్టీ అధికారంలోకి రావాలంటే ఏం చేయాలో చెప్పండి..గతంలో ఇదే చెప్పాను..మీడియా ముందు పార్టీ ఇంటర్నల్ ప్రాబ్లమ్స్ మాట్లడొద్దని సీరియస్ అయ్యారు. ఏదైనా ఉంటే ఖర్గే, కేసీ వేణుగోపాల్ దగ్గర చెప్పుకోవాలని రాహుల్ గట్టిగానే చెప్పినట్లు తెలుస్తోంది.ఇక ఖమ్మం గార్డెన్ పక్కన దాదాపు వంద ఎకరాల స్థలంలో బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 4 లక్షల మంది జన సమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది హస్తం పార్టీ.

# కొత్తగా కోటిమందికి పైగా ఐటీఆర్

**హైదరాబాద్ :**

2022-23 ఆర్థిక సంవత్సరం/2023-24 మదింపు సంవత్సరానికి ఆదాయ పన్ను రిటర్న్‌లు ఫైల్ చేసే ప్రక్రియ వేగంగా సాగుతోంది. జీతం పొందే పన్ను చెల్లింపుదార్లలోఎక్కువ మంది తమ కంపెనీల నుంచి ఈ నెల (జూన్ 2023) 15 నాటికి ఫామ్-16 అందుకున్నారు. దీంతో, జూన్ 15 తర్వాతి నుంచి ఇన్‌కం టాక్స్ రిటర్న్ ఫైలింగ్ నంబర్లలో వేగం పెరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరం/2023-24 అసెస్‌మెంట్ సంవత్సరానికి, 26 జూన్ 2023 వరకు, కోటి మంది పన్ను చెల్లింపుదార్లు ఆదాయ పన్ను రిటర్న్‌లు దాఖలు చేసినట్లు ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ ట్వీట్ చేసింది. చివరి తేదీ వరకు ఆగకుండా ముందుగానే ఐటీఆర్ ఫైల్ చేయడంపై టాక్స్ పేయర్లను అభినందించింది. గత అసెస్‌మెంట్ ఇయర్ 2022-23లో, 8 జులై 2023 నాటికి కోటి మంది పన్ను చెల్లింపుదార్లు ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 12 రోజుల ముందుగానే ఆ మైలురాయిని సాధించినట్లు ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది.టాక్స్ పేయర్లు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆదాయపు పన్ను పత్రాలను సులభంగా దాఖలు చేయడం తమ ప్రాధాన్యతల్లో ఒకటి ఆదాయ పన్ను విభాగం హామీ ఇచ్చింది. చివరి క్షణంలో రిటర్న్ దాఖలు చేసేందుకు హడావిడి పడకుండా, ఇదే ఊపును కొనసాగించాలని, ఐటీఆర్ త్వరగా ఫైల్ చేయాలని టాక్స్ పేయర్లకు ఆదాయపు పన్ను విభాగం విజ్ఞప్తి చేసింది.2023-24 అసెస్‌మెంట్ సంవత్సరానికి ఆదాయ పన్ను రిటర్న్ దాఖలు చేయడానికి చివరి తేదీ 31 జులై 2023. రిటర్న్‌లు సమర్పించే ఇండివిద్యువల్ టాక్స్ పేయర్లలో ఎక్కువ మంది ఐటీఆర్ -1 ఫామ్ ద్వారా ఆదాయాన్ని ప్రకటిస్తారు. వ్యక్తిగత పన్ను చెల్లింపుదార్ల వార్షిక ఆదాయం రూ. 50 లక్షల కంటే తక్కువగా ఉండి; జీతం, ఒక ఇంటి ఆస్తి, బ్యాంకు నుంచి వడ్డీ, డివిడెండ్, వార్షిక వ్యవసాయ ఆదాయం రూ. 5000 దాటకుండా ఉంటే.. అటువంటి పన్ను చెల్లింపుదార్లు ఐటీఆర్ -1 ఫామ్ ద్వారా ఆదాయాన్ని ప్రకటించాలి.ఈ నెల 30తో పాన్-ఆధార్ అనుసంధానం గడువు ముగుస్తుంది. ఈ రెండింటిని లింక్ చేయకపోతే ఐ రిటర్న్ సమర్పించడం సాధ్యం కాదు. కేవలం రూ. 1,000 జరిమానా చెల్లించి, ఈ నెల 30లోగా పాన్-ఆధార్‌ను లింక్ చేయవచ్చు. కేవలం అని ఎందుకు చెప్పామంటే, జూన్ 30 తర్వాత రూ. 10 వేలు ఫైన్ కట్టాల్సిరావచ్చు. పాన్-ఆధార్ లింక్ కాకపోతే, పాన్ కార్డ్ నాన్-ఆపరేటివ్‌గా మారుతుంది. పన్ను చెల్లింపుదార్లకు రిఫండ్ రాదు. పాన్ పని చేయని కాలానికి రిఫండ్‌పై వడ్డీ చెల్లించరు. అలాగే, అలాంటి పన్ను చెల్లింపుదార్ల నుంచి ఎక్కువ టీడీఎస్ డ టీసీఎస్ వసూలు చేస్తారు.రెండు రోజులే ఆధార్ లింక్ కు టైమ్‌హైదరాబాద్, జూన్ 28, (న్యూస్ పల్స్) మీరు మీ ఇన్‌కం టాక్స్ రిటర్న్ (ఐటీఆర్) ఫైల్ చేయాలంటే, ముందుగా మీ ఆధార్ కార్డ్‌ను - పాన్ కార్డ్‌ను కచ్చితంగా లింక్ చేయాలి. ఈ రెండింటికీ జత కుదర్చకపోతే ఐటీఆర్ ఫైల్ చేయలేరు. ఒకవేళ ఐటీఆర్ ఫైల్ చేసేందుకు టాక్స్ డిపార్ట్‌మెంట్ అనుమతించినా, కొన్ని టాక్స్ బెనిఫిట్స్‌ను మాత్రం మిస్ అవ్వాల్సి వస్తుంది.మీ ఆధార్ కార్డ్‌ను - పాన్ కార్డ్‌ను లింక్ చేయడానికి ఈ నెలాఖరు వరకే గడువు ఉంది. వాస్తవానికి, పన్ను చెల్లింపుదార్లకు ఉపశమనం కలిగించడానికి పాన్-ఆధార్ నంబర్ అనుసంధానం డెడ్‌లైన్‌ను అఃఙు గతంలోనే పెంచింది. ఈ ఏడాది మార్చి 31వ తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకు పొడిగించింది. ఇప్పుడు ఆ లాస్ట్‌డేట్ కూడా ముగింపునకు వచ్చింది. జూన్ 30 లోగా పాన్-ఆధార్ లింక్ పూర్తి చేయడానికి రూ. 1,000 జరిమానా కడితే సరిపోతుంది. ఆ తర్వాత, ఇదే పని కోసం రూ. 10 వేలు ఫైన్ కట్టాల్సిరావచ్చని సమాచారం. 30 జూన్ 2023లోపు పాన్ కార్డ్‌తో ఆధార్‌ను లింక్ చేయకపోతే, సదరు వ్యక్తి పాన్ కార్డ్ నాన్-ఆపరేటివ్‌గా మారుతుంది. ఆ తర్వాత అధిక జరిమానా ఎదుర్కోవలసి వస్తుంది. పాన్-ఆధార్ లింక్ కాకపోతే, టాక్స్ పేయర్‌కు రిఫండ్ రాదు. పాన్ పని చేయని కాలానికి రిఫండ్‌పై వడ్డీ చెల్లించరు. అలాగే, అలాంటి పన్ను చెల్లింపుదార్ల నుంచి ఎక్కువ టీడీఎస్ డ టీసీఎస్ వసూలు చేస్తారు. అంతేకాదు, పాన్ కార్డ్-ఆధార్ అనుసంధానం కాకపోతే ఆర్థికపరమైన లావాదేవీల్లో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. బ్యాంక్ అకౌంట్, డీమాట్ అకౌంట్ ఓపెన్ చేయలేరు. షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టలేరు. పాన్ కార్డ్ అవసరమైన ప్రతి చోట పని ఆగిపోతుంది. పాన్‌తో ఆధార్‌ను లింక్ చేసి, ఫైన్ కట్టిన తర్వాత 30 రోజుల్లో పాన్ మళ్లీ క్రియాశీలంగా మారుతుంది.పాన్-ఆధార్ లింక్ నుంచి మినహాయింపు పొందిన వ్యక్తులు, వాటిని అనుసంధానించాల్సిన అవసరం లేదు. నిర్దిష్ట రాష్ట్రాల్లో నివసించే వ్యక్తులు, చట్టం ప్రకారం నాన్ రెసిడెంట్‌లు, భారతీయ పౌరులు కాని వాళ్లు, గత సంవత్సరం నాటికి 80 ఏళ్లు పైబడిన వాళ్లు మినహాయింపు వర్గంలోకి వస్తారు.ఆధార్-పాన్‌ను ఎలా లింక్ చేయాలి?ఆదాయపు పన్ను ఈ-ఫైలింగ్ పోర్టల్ ను ఓపెన్ చేయండి.ఈ వెబ్‌సైట్‌లో (ఇప్పటికీ చేయకపోతే) రిజిస్టర్ చేయసుకోండి.మీ పాన్ (పర్మినెంట్ అకౌంట్ నంబర్) మీ యూజర్ ఎఊ అవుతుంది.యూజర్ ఎఊ, పాస్‌వర్డ్, పుట్టిన తేదీని నమోదు చేసి లాగిన్ అవ్వండి.ఇప్పుడు, మీ పాన్‌ను ఆధార్‌తో లింక్ చేయడానికి పాప్-అప్ విండో ఓపెన్ అవుతుంది.పాప్ అప్ విండో తెరుచుకోకపోతే, మెనూ బార్‌లోని 'ప్రొఫైల్ సెట్టింగ్స్'లోకి వెళ్లి 'లింక్ ఆధార్'పై క్లిక్ చేయండి.పాన్ కార్డ్‌లో ఉన్న ప్రకారం మీ పేరు, పుట్టిన తేదీ వంటి వివరాలు అక్కడ కనిపిస్తాయి.మీ ఆధార్, పాన్ కార్డ్ వివరాలను సరిచూసుకోండి.వివరాలు సరిపోలితే, మీ ఆధార్ నంబర్‌ను నమోదు చేసి, "లింక్ నౌ" బటన్‌పై క్లిక్ చేయండి.మీ ఆధార్ మీ పాన్‌తో విజయవంతంగా లింక్ అయిందన్న పాప్-అప్ మెసేజ్ మీకు తెలియజేస్తుంది.

# ఓఆర్ఆర్ పై స్పీడ్ లిమిట్ 120

**హైదరాబాద్ :**

హైదరాబాద్ కు మణిహారంగా నిలిచిన ఔటర్ రింగ్‌రోడ్డుపై వాహనదారులు మరింత వేగంతో దూసుకుపోవచ్చు. ఈ మేరకు పురపాలకశాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఓఆర్ఆర్ పై గరిష్టంగా 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లడానికి వాహనదారులకు అనుమతి ఉంది. అయితే ఈ వేగాన్ని తాజాగా 120 కిలోమీటర్లకు పెంచింది ప్రభుత్వం. పురపాలకశాఖ, ఓఆర్ఆర్ అధికారులతో మంత్రి కేటీఆర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రయాణికుల భద్రతకు మరిన్ని మెరుగైన చర్యలు తీసుకుంటాం అన్నారు. సమీక్ష అనంతరం పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ పై స్పీట్ లిమిట్ ను 120 కిలోమీటర్లకు పెంచినట్లు వెల్లడించారు.హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు టోల్ టెండర్ అప్పగింత విషయంపై వివాదం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అవినీతికి పాల్పడిందని బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఓఆర్ఆర్ పై ఏడాదికి రూ.415 కోట్ల ఆదాయం వస్తుందని. ఇది ఏటా ఐదు శాతం పెరగుతూ పోయినా 30 ఏళ్లకు రాష్ట్ర ప్రభుత్వానికి 30 వేల కోట్ల ఆదాయం చేకూరేదన్నారు. సొంత ప్రయోజనాలతో రాష్ట్రానికి వేలకోట్ల నష్టం వస్తుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సైతం తీవ్ర ఆరోపణలు చేయడం తెలిసిందే. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆ ఆరోపణలపై ప్రజలకు కేసీఆర్ సమాధానం చెప్పాలని పలుమార్లు డిమాండ్ చేశారు.

## తల్లీ ఇద్దరు పిల్లలు ఆత్మహత్య



**యాదాద్రి**
యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ 9వ వార్డులో విషాదం చోటుచేసుకుంది. అప్పులు తీర్చలేక ఆర్ధిక ఇబ్బందులతో అవిషేట్టి రాజేశ్వరి (28) తన ఇద్దరు మగ పిల్లలు తో సంపులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మృతదేహాలను స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రానికి పోలీసులు తరలించారు. ఘటనతో ఒక్కసారిగా ఆసుపత్రి చుట్టూ బంధువుల ఆర్తనాదాలతో విషాద ఛాయలు అలుముకున్నాయి. అవిశేట్టి రాజేశ్వరి భర్త మల్లేష్ లారీ డ్రైవర్ గా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. చనిపోయిన పిల్లల పేర్లు అనిరుధ్ (3),హర్ష వర్ధన్(2)

## విడిపోయిన గూడ్స్ బోగిలు



**వరంగల్**
వరంగల్ జిల్లా కేసముద్రంలో రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలుకు తృటిలో ప్రమాదం తప్పింది. ఖమ్మం నుంచి వరంగల్ వైపు వెళ్ళే గూడ్స్ రైలు నుంచి రెండు బోగీలు విడిపోయాయి. దాంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది లోకో పైలెట్ కి సమాచారం ఇచ్చారు. కిలోమీటర్ పైగా ముందుకు వెళ్లి మళ్ళీ ట్రైన్ వెనక్కి వచ్చి భోగి తగిలించుకొని వెళ్ళింది. విడిపోయిన బోగీలు పట్టాలు తప్పకపోవడంతో రైల్వే అధికారులు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

## ఆర్ధిక సంస్కరణల జాతిపిత పివి

**హైదరాబాద్**
మాజీ ప్రధానమంత్రి పివి 102 వ జయంతి సందర్భంగా పివి ఘాట్ లో బుధవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాళులు అర్పించారు. మంత్రిమాట్లాడుతూ దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి పివి నరసింహ రావు. సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని ఆర్ధిక ఇబ్బందుల నుండి గట్టెక్కిచ్చిన గొప్ప నాయకుడు పివి. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం లోని తెలంగాణ ప్రభుత్వం పివి సేవలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ తగినరీతిలో గౌరవిస్తుందని అన్నారు. . అయన చేసిన సేవలకు గుర్తింపు గా కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని మంత్రి తలసాని డిమాండ్ చేసారు.

## తాళం వేసివున్న ఇంట్లో భారీ చోరీ

**గన్నవరం**
ఉంగుటూరు మండలం తేలప్రోలు లో తాళాలు వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన వింత వీరారెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అయనను ఆపరేషన్ నిమిత్తం కుమారుడు హైదరాబాద్ కు తీసుకు వెళ్లాడు. గత 20 రోజుల నుంచి ఇంటికి తాళాలు వేసి ఉండటాన్ని దుండగులు గమనించారు. చోరీ చేసారు. ఆపరేషన్ చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో సమీప బంధువులకు ఇంటిని శుభ్రం చేయమని వీరారెడ్డి కుమారుడు చెప్పాడు. బంధువుల వచ్చి ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురు గా వుండడం, బీరువా పగలగొట్టి బంగారం వెండి నగదు అపహారించినట్లు గుర్తించారు. భారీ మొత్తంలో బంగారం నగదు వెండి అపహరణకు గురైనట్లు బాధితులు చెబుతున్నారు. ఇంటి యజమానులు లేకపోవడంతో వారు వచ్చిన తర్వాత అసలు ఎంత ఏమి పోయింది అన్నది బయటపడాల్సి ఉంది. బంధువుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

## వరాహి యాత్ర విజయవంతం కావాలి

**తిరుమల**
బుధవారం నాడు మచిలీపట్నం నియోజకవర్గ నుంచి స్థానిక పెదయాధర సర్పంచ్ మరియు మచిలీపట్నం జనసేన పార్టీ మండల అధ్యక్షులు గల్లా తిమోతి, ఇతరులు శ్రీవారిని దర్శించుకోవడం జరిగింది గత 15 రోజులుగా ఆంధ్రప్రదేశ్ ఉభయగోదావరి జిల్లాలలో వారాహి విజయయాత్ర నిర్వహిస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వారాహి యాత్రలో కోర్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తూ ఈ రోజున తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుపతి రావడం జరిగిందని తెలిపారు. వారాహి విజయ యాత్ర సంకల్పించిన పవన్ కళ్యాణ్ కి అంతా మంచి జరగాలని మరియు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. రాబోయే రోజుల్లో ఆయన ముఖ్యమంత్రిగా ప్రజలు మనలను పొంది బాధ్యతలు చేపట్టాలని గల్లా తిమోతి శ్రీవారిని వేడుకున్నారు

# కాంగ్రెస్ లో నేతలకు కొత్త ఆశలు

**విజయవాడ :**

వైఎస్సార్ కుటుంబం మళ్లీ కాంగ్రెస్ కు దగ్గర అవుతుందనే ప్రచారంతో కాంగ్రెస్ శ్రేణులు ఆశగా ఎదురు చూస్తున్నాయి. ఇప్పుడు షర్మిల తరువాత విజయమ్మ, బ్రదర్ అనిల్ కూడా కాంగ్రెస్ లోకి రావాలంటూ నేతలు ఆహ్వానిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో తిరిగి పుంజుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ అసలు కనిపించకుండా పోయింది. ఇప్పటివరకు ఆ పార్టీకి ఎదురుదెబ్బలే తగిలాయి. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేదు. అయితే ఇటీవల జాతీయ కాంగ్రెస్ కార్యాలయం కేంద్రంగా జరుగుతున్న పరిణామాలతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ లో నేతలకు కొత్త ఆశలు చిగురిస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మరణం తరువాత రాష్ట్ర విభజన అంశం తెర మీదకు రావటం, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని విడకొట్టి సంచలన రాజకీయాలకు తెరతీయటంతో పరిస్దితులు ఉన్నపళంగా మారిపోయాయి. అయితే ఇప్పుడు మరోసారి వైఎస్సార్ కుటుంబం తిరిగి కాంగ్రెస్ కు దగ్గర అవుతుందనే ప్రచారం జరగటంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దాని ప్రభావం ఉంటుం దని అంటున్నారు. షర్మిల కాంగ్రెస్ లో చేరికతో ఎన్నికల సమయంలో ఏపీలో కూడా ఉపయోగం ఉంటుందన్న అభిప్రాయం కాంగ్రెస్ నేతల్లో వ్యక్తం అవుతోంది. షర్మిల కాంగ్రెస్ పార్టిలోకి వస్తారనే అంశం చర్చకు వస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ లో ఉన్న అతితక్కువ మంది కాంగ్రెస్ నాయకులు చాలా సీరియస్ గానే రియాక్ట్ అవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అవకాశాలకు వేదికగా ఉంటుందని, ఎవరు వచ్చినా పార్టి ఆహ్వానిస్తుందని చెబుతున్నారు. అంతే కాదు కాంగ్రెస్ వంటి పార్టీలో ఎప్పుడు ఎవరు ముఖ్యమంత్రి అవుతారో తెలియదని, అలాంటి అవకాశాలు ఉన్న పార్టిని ఎవ్వరూ వదలుకోరని చెబుతున్నారు. ఇప్పుడు షర్మిల కాంగ్రెస్ లోకి రావటం వలన పార్టికి మేలు కలుగుతుందని అంటున్నారు. అంతే కాదు షర్మిలతో పాటుగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి భార్య విజయమ్మ, షర్మిల భర్త బ్రదర్ అనిల్ కూడా కాంగ్రెస్ లోకి రావాలని పిలుపునిస్తున్నారు. కాంగ్రెస్ పార్టిలో అనేక మంది నాయకులకు గుర్తింపు వచ్చిందని అందులో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి కూడా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే వైఎస్, వైఎస్ అంటే కాంగ్రెస్ పార్టిగా ఉన్న రోజుల్లోనే రాహుల్ గాంధీని ప్రధాని చేయాలనే లక్ష్యంతో రాజశేఖర్ రెడ్డి పని చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మరో వైపున భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టి అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన యాత్ర తో కాంగ్రెస్ నే వీడిన పాత నేతలంతా తిరిగి కాంగ్రెస్ లోకి రావటానికి ఇష్టపడుతున్నారు. అందులో భాగంగానే వైఎస్ ఫ్యామిలి కూడా కాంగ్రెస్ లోకి ఎంట్రీ ఇవ్వనుందని, ఇందుకు జులై ఎనిమిదో తేదీ, వైఎస్సార్ జయంతి కార్యక్రమాన్ని వేదికగా చేసుకుంటున్నారని చెబుతున్నారు.

# మధ్యప్రదేశ్ లో హోరా హోరి..

**భోపాల్ :**

త్వరలో ఎన్నికలు జరగనున్న 5 రాష్ట్రాలలో మధ్యప్రదేశ్ ఒకటి. ఈ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2023కి సంబంధించి తొలి ఒపీనియన్ పోల్ ఫలితాలు వచ్చేశాయి. మధ్యప్రదేశ్ ఎన్నికలలపై ఫస్ట్ ఒపీనియన్ పోల్ నిర్వహించి బీజేపీ, కాంగ్రెస్ లకు ఎన్ని సీట్లు వస్తాయో వెల్లడించింది. మొత్తం 230 సీట్లున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీలో అధికారం ఈసారి కూడా రెండు పార్టీలను దోబూచులాడేలా కనిపిస్తోంది.మధ్యప్రదేశ్ లో అధికార పార్టీ బీజేపీకి 106 నుంచి 118 సీట్లు వచ్చే అవకాశం ఉంది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి కనిష్టంగా 108, గరిష్టంగా 120 సీట్లు రావొచ్చునని తాజా ఒపీనియన్ పోల్ సర్వేలో తేలింది. బీఎస్పీకి 1 నుంచి 4 సీట్లు వచ్చే ఛాన్స్ ఉంది. అయితే గత ఎన్నికల తరహాలోనే మధ్యప్రదేశ్ ఓటర్లు అటు బీజేపీకి గానీ, ఇటు కాంగ్రెస్ కు గానీ సంపూర్ణ మెజార్టీ ఇవ్వడం లేదు. హంగ్ వచ్చినా రావొచ్చునని తాజా సర్వే చెబుతోంది. అయితే ఓట్ల పరంగా చూసినా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు 44 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేశారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 114 సీట్లతో సింగిల్ లార్జెస్ట్ పార్టీకి నిలిచింది. సాధారణ మెజార్టీకి 2 సీట్లు తక్కువగా వచ్చాయి. బీజేపీ 109 స్థానాల్లో గెలుపొంది, రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్ చేరుకోలేక పోయినప్పటికీ, 15 ఏళ్ల తరువాత మధ్యప్రదేశ్ లో హస్తం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మాజీ సీఎం కమల్ నాథ్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇద్దరు బీఎస్పీ ఎమ్మెల్యేలు, ఒక ఎస్పీ ఎమ్మెల్యే, నలుగురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు మద్దతిచ్చారు. దాదాపు ఏడాదిపాటు కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగింది. కానీ అధిష్టానం తనను సీఎం చేయలేదని, తనకు గౌరవం దక్కడం లేదంటూ పార్టీని వీడి బీజేపీలో చేరారు. తనతో పాటు 22 మంది ఎమ్మెల్యేలను కాషాయపార్టీలోకి తీసుకెళ్లడంతో కమల్ నాథ్ సర్కార్ కూలిపోయింది. పార్టీ మారిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మద్దతుతో మెజార్టీ రావడంతో శివరాజ్ సింగ్ చౌహాన్ నాల్గవసారి ముఖ్యమంత్రి అయ్యారు.త్వరలో జరగనున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈసారి ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీలను ఎదుర్కొని బీజేపీ అధికారంలోకి రావడం కష్టమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, ఏబీపీ సీ ఓటర్ తొలి ఒపీనియన్ పోల్ లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటు షేర్ సమానంగా ఉంది. కానీ కాంగ్రెస్ పార్టీకి బీజేపీ కంటే నాలుగైదు సీట్లు అధికంగా వస్తాయని తాజా సర్వేలో వచ్చింది.

# ఈటల భద్రతపై ప్రభుత్వం ఆరా

**హైదరాబాద్ :**

భద్రతకు ముప్పు ఉందని ఈటల రాజేందర్ చేసిన కామెంట్స్ తెలంగాణలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. తనకు బెదిరింపులు వస్తున్నాయని ఈటల అంటే.. తన భర్తను చంపే కుట్ర జరుగుతోందన్నారు. దీని కోసం సుపారీ కూడా ఇస్తున్నారని ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ కేంద్రంగానే వాళ్లీ ఆరోపణలు చేశారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధిపై తీవ్ర ఆరోపణలు రావడంతో ప్రభుత్వం అలర్ట్ అయింది. వెంటనే ఈటల భద్రతపై రివ్యూ చేపట్టాలని అధికారులను ఆదేశించింది. వెంటనే కలుగుజేసుకున్న డీజీపీ... మేడ్చల్ డీసీపీ సందీప్‌రావుకు స్పెషల్ టాస్క్ ఇచ్చారు. డీజీపీ ఆదేశాల మేరకు స్పందించిన సందీప్‌రావు ఈటల రాజేందర్‌ను కలిసేందుకు ఆయన ఇంటికి వెళ్లారు. అయితే అప్పటికే ఈటల బయటకు వెళ్లిపోయారని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆయన తిరిగి వచ్చేశారు. ఈటల వచ్చిన తర్వాత మరోసారి వెళ్లి ఆయనతో మాట్లాడనన్నారు. వివరాలు తీసుకొని డీజీపీకి రిపోర్ట్ చేయనున్నారు. మంగళవారం ఈటల రాజేందర్ సతీమణి జమున హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. ఈటల రాజేందర్‌ను చంపేందుకు కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.20 కోట్లు ఇచ్చి ఈటలను చంపిస్తానంటూ కౌశిక్ రెడ్డి అన్నట్లు తమకు తెలిపిందని కామెంట్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహంతోనే కౌశిక్ రెడ్డి చెలరేగిపోతున్నారని ఆరోపించారు. తమ కుటుంబసభ్యులకు ఒక్క రక్తపు బొట్టు కింద పడ్డా దానికి సీఎం కేసీఆర్‌దే బాధ్యతని అన్నారు. కౌశిక్ రెడ్డి లాంటి ఓ పిచ్చికుక్కను ఎమ్మెల్సీని చేసి సీఎం కేసీఆర్ హుజూరాబాద్ ప్రజల మీదకు వదిలారని ఘాటుగా వ్యాఖ్యానించారు జమున. పిచ్చికుక్క అరాచకాలు పెరిగిపోయాయని, నియోజకవర్గ ప్రజలు, మహిళల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆ తర్వాత ప్రెస్ మీట్ పెట్టిన ఈటల కొన్ని నెలలుగా తనకు బెదిరింపులు వస్తున్నాయని చెప్పారు. ఎలాంటి బెదిరింపులకు భయపడేవాడిని కానన్నారు. నయీమ్ కే భయపడలేదని గుర్తు చేశారు. ఈ బెదిరింపులకు భయపడతానా అని ప్రశ్నించారు. తనతో పెట్టుకుంటే మాడిమసైపోతారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల హెచ్చరించారు.

# అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

**విజయవాడ**

అగ్రిగోల్డ్ బాధితుల ఆర్తనాదాలు సీఎం జగన్ చెవికి చేరడం లేదా అని, ఆరు మాసాల్లో ఇరవై లక్షల మందికి రూ.3986 కోట్లు వడ్డీతో సహా చెల్లిస్తామని జగన్ హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అయినా ఇంతవరకు స్పందన లేదని అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు ప్రశ్నించారు. కేవలం రూ.906 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అగ్రిగోల్డ్ బాధితులు అనేక మంది ఆత్మహత్యలు చేసుకున్నారన్నారని మండిపడ్డారు. చంద్రబాబు నాడు మూడు లక్షలు ఇస్తానంటే.. జగన్ పది లక్షలు పూలల్లో పెట్టి ఇస్తానన్నారని, మరి జగన్కు నేటి వరకు పూలు దొరకలేదా.. డబ్బులు రాలేదా చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు బాధితులను ఆదుకునే ఉద్దేశం జగన్కు ఉందా అనే అనుమానం కలుగుతోందని దుయ్యబట్టారు . అగ్రిగోల్డ్ ఆస్తులు నలభై వేల కోట్లు ఉన్నాయని చైర్మన్ తమ్ముడు చెబుతున్నారని.. మరి ఇంత ఆస్తులు ఉంటే... రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బాధితులకు డబ్బులు చెల్లించడం లేదని నిలదీశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హామీల వర్షం కురిపించి.. ఇప్పుడు మౌనం ఎందుకు వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ స్పందించి మృతుల కుటుంబాలకు పది లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, ఆగష్టు 15 నాటికి బాధితులను ఆదుకోకపోతే ఆగష్టు 30న విజయవాడను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఇంతకాలం ఎదురు చూశాం.. ఇక మా ఓర్పు, సహనం నశించాయని, ఈలోపు వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు విజ్ఞాపన పత్రాలు అందిస్తామని చెప్పారు. అన్ని జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు పూర్తి చేసి కార్యాచరణపై చర్చిస్తామని పేర్కొన్నారు.

## జర్నలిస్ట్ లపై ఆర్ ఏం వో మండిపాటు

**శ్రీకాకుళం**
శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రి ఆర్ఎంవో శంకర రావు మీడియాపై చిందులువేసారు. రిమ్స్ లోకి జర్నలిస్ట్ లకు లకు అనుమతి లేదంటూ గేట్ వేసి మరీ విరుచుకపడ్డారు. పలువురు జర్నలిస్టులు కుప్పిలి మర్డర్ విషయమై మార్చురీ దగ్గరికి వెల్తామని అయన అనుమతి కోరారు. దాంతో అయనకు చిర్రెత్తింది. తిట్ల పురాణం ప్రారంభించి, వెనుకబడిన శ్రీకాకుళం జిల్లానాకోడుకులు అంటూ అసహ్య పదజాలం ఉపయోగించారు. మీడియా ముందు తొడ గోడుతూ బూతులు తిట్టారు.

## టీడీపీ రథయాత్ర బస్సు ప్రారంభం

**కావలి**
నెల్లూరు జిల్లా కావలి లో భవిష్యత్ గ్యారెంటి చైతన్య రథయాత్ర బస్సును కావలి తెదేపా నియోజకవర్గ ఇంచార్జ్ మాలే పాటి సుబ్బా నాయుడు ఆధ్వర్యంలో మహిళల చేత పూజలు నిర్వహించి , జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం తెదేపా అధికారంలో 80 శాతం పూర్తైన పనులకు సంబంధించిన పాపిరెడ్డి చెరువులో మురికిశుద్ధి కేంద్రం,, పెద్దపవని రోడ్డు బ్రిడ్జి నిర్మాణం , టిడ్కో ఇళ్ళ పై , రుద్రకోటలో అక్రమ గ్రావెల్ పై సెల్ఫీ ఛాలెంజ్ తో నిరసనలు తెలిపారు.ఈ సమావేశంలో. కందుకూరి నియోజకవర్గ ఇంచార్జీ ఇంటూరి నాగేశ్వర్ రావు , కోవూరు ఇంచార్జీ పోలంరెడ్డి దినేష్ రెడ్డి , కంభం విజయరా మి రెడ్డి , చెంచుల బాబు యాదవ్ , తాళ్ళపాక అనురాధ లు పాల్గొన్నారు. మీడియా సమావేషంలో మాలేపాటి సుబ్బానాయుడు మాట్లాడుతూ ఎమ్మల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పట్టణంలో గ్రావెల్ ,ఇసుక , లేవుట్ ల స్థలాలు, డొంకలు , వాగులు కూడా వదలటం లేదని అవినీతి దొంగ అని , ఎన్నిసార్లు గ్రావెల్ పై మాట్లాడిన నిమ్మకు నీరెత్తే లాగా వ్యవహరిస్తున్నాడని సిగ్గు , శరం లేదని అన్నారు.ఎవరైనా అవినీతిపై గళం విప్పితే వారిపై అక్రమ కేసులు పెట్టడం .తెదేపా అధికారంలోకి వస్థే ప్రభుత్వానికి రావాల్సిన డబ్బులను ముక్కుపట్టి వసూల్ చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు , కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు

## అక్రమంగా గోవులను రవాణా చేస్తున్న లారీలను పట్టుకున్న బిజెపి నాయకులు

**అమలాపురం**
డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రెండు వాహనాల్లో గోవులను అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు వ్యక్తులను భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు అధ్వర్యంలో పోలీసులకు అప్పగించారు రెండు వాహనాల్లో సుమారు 14 గోవులను గుర్తించినట్లు వాటిలో ఒక ఆవు చనిపోయి ఉందని అన్నారు. విషయం తెలిసిన వెంటనే వాహనాలను అడ్డగించి అమలాపురం డిఎస్పి అంబికా ప్రసాద్ కు ఫిర్యాదు చేసామని..కొందరు విచ్చలవిడిగా గోవులను రవాణా మరియు విక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు.దీనిపై స్పెషల్ టీం ఏర్పాటు చేసి గో విక్రయాలు మరియు రవాణా అరికట్టాలని వారు కోరారు.

## ఘనమైనది పీవీ చరిత్ర

**హైదరాబాద్:**
పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా పీవీ ఘాట్ లో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెళ్లారు. పీవీ నర్సింహారావుకు ఘనమైన నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పీవీ చరిత్ర ఘనమైనది.. దక్షిణ భారతం నుంచి ప్రధాన మంత్రి అయిన ఏకైక వ్యక్తి పీవీనే అని ఆయన పేర్కొన్నారు.తెలంగాణ ముద్దు బిడ్డ.. ఆయన జీవితం అందరికి స్ఫూర్తిదాయకం అని టీ.బీజేపీ చీఫ్ బండి సంజయ్ అన్నారు. పీవీ ప్రధాని కావడం తెలంగాణకు గర్వకారణం.. దేశ వ్యాప్తంగా పీవీ జయంతుత్సవాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. పీవీ మరణాన్ని కాంగ్రెస్ పార్టీ అవమాన పరిచింది.. దహన సంస్కారాలు కూడా చేయలేక పోయింది.. కాంగ్రెస్ నాడు? అవమానిస్తే, కేసీఆర్ ఈరోజు పీవీనీ అవమానిస్తున్నాడు అని బండి సంజయ్ విమర్శించాడు.గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీవీని స్మరించిన తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు ఏమైంది.. కేసీఆర్ పక్క పొలిటీషియన్.. ఓట్లు దండుకొవడం ఎలాగో ఆయనకు బాగా తెలుసు అని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. కేసీఆర్ కాదు కేసీఆర్ కింద ఉన్న కుర్చీకి విలువ ఇస్తున్నామన్నాడు.కాంగ్రెస్ పార్టీ పీవీ నర్సింహారావును అవమానించింది.. బీఆర్ఎస్ ఇప్పటికి అవమానిస్తూనే ఉంది.. గతంలో పీవీ ఘాట్ ను కూల్చేస్తామని కొందరు మూర్ఖులు అన్నారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని కేసీఆర్ ఇప్పుడు కాక ఇంకేప్పుడు అడుగుతాడు అని బండి సంజయ్ ప్రశ్నించారు. నేటికి మన దేశంలో పీవీ ప్రవేశ పెట్టిన సంస్కరణలే కొనసాగుతున్నాయని అన్నారు.

## ఏసీబీ వలలో విఆర్ ఓ

**నందిగామ**
చందర్లపాడు తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. బుధవారం నిర్వహించిన ఈ దాడుల్లో గ్రామ విఆర్ఓ వైకుంఠరావు రూ 5000 లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీకి పట్టుపడ్డాడు. పొలాలకు సంబంధించి పాస్ పుస్తకాల విషయమై ఒక రైతును విఆర్ ఓ లంచం అడిగినట్లు సమాచారం. లంచం ఇచ్చుకొని స్థితిలో రైతు ఏసిబిని ఆశ్రయించడంతో ఈ దాడులు జరిపి రెడ్ హ్యాండెడ్ గా వీఆర్వో ని పట్టుకున్నారు. నిందితుడినుంచి లంచం నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసారు.

# ఏపీలో అరవై లక్షల దొంగ ఓట్లు

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్‌లో ఓటరు జాబితా అంశం సంచలనం సృష్టిస్తోంది. పెద్ద ఎత్తున పాత ఓట్లు తీసేయడం.. కొత్త ఓట్లు చేర్చడం వంటివి హైలెట్ అవుతున్నాయి. తెలుగుదేశం పార్టీ నేతలు పోలింగ్ బూత్ ల వారీగా చూసి.. ఒకే డోర్ నెంబర్ తో ఉన్న ఓట్లను కనిపెట్టి మీడియా ముందు పెడుతున్నారు. దొంగ ఓట్లను భారీ ఎత్తున చేర్చారని అంటున్నారు. ఈ ఆరోపణలతో ఎన్నికల సంఘం కూడా ఉక్కిరి బిక్కిరి అవుతోంది. కొన్ని చోట్ల తప్పులు జరిగాయని కూడా అంగీకరించాల్సి వచ్చింది. అన్నింటినీ పరిశీలిస్తే దొంగ ఓట్లను తొలగిస్తామని చెబుతున్నారు. కానీ ఇలా ఎందుకు ఓటర్ల లిస్టులో ఊహించని విధంగా మార్పులు చేర్పులు జరుగుతున్నాయన్నది మాత్రం సస్పెన్స్ గానే ఉంది. ఓటరు జాబితాలో ఓటు తొలగించాలంటే ముందు నోటీసు జారీ చేయాలి. వివరణ తీసుకుని సరైన కారణం ఉంటే ఓటు తొలగించాలి. కానీ ఎలాంటి నోటీసులు లేకుండా ఓటును తొలగించేస్తున్నారు. అలాగే కొత్త వారిని చేర్పించేస్తున్నారు. టెక్నాలజీ ఇంత పెరిగిన తర్వాత కూడా ఎవరి ఇష్టారీతిన వాళ్లు ఓట్లు తొలగించుకుని.. కావాల్సిన వారిని చేర్పించుకుని గెలవాలనుకుంటే ఇక ప్రజాస్వామ్యం ఎందుకని విపక్షాలు ప్రశ్నస్తున్నాయి. గుంటూరులో ఒక్క పోలింగ్ బూత్ వందల కొద్దీ దొంగ ఓట్లు బయటపడ్డాయి. ఇది చిన్న విషయం కాదు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మొత్తం మీద ఇలా ఎన్ని ఓట్లు నమోదు చేశారో.. ఎంత మంది ఓట్లు తొలగించారో చెప్పడం కష్టం. అన్ని చోట్లా ఇలాగే ఉందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మరో వైపు వైసీపీ ఓటర్ లిస్టులో అరవై లక్షల దొంగ ఓట్లు ఉన్నాయంటున్నారు. అంత స్థాయిలో దొంగ ఓట్లు ఎలా ఉంటాయన్నది పక్కన పెడితే.. ఆ పార్టీ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తమ పార్టీ నేతలకు అదే చెబుతున్నారు. పార్టీ నేతలంతా అరవై లక్షల దొంగ ఓట్లను తొలగించేందుకు కృషి చేయాలని పిలుపుస్తున్నారు. ఇప్పటికే ఈ తొలగింపు ప్రారంభించారేమో కానీ వివాదా?పదం అవుతోంది. వాలంటీర్లతో ఓట్ల తొలగించే ప్రక్రియ జరుగుతుందని అంటున్నారు. ఇక ఓటర్ లిస్ట్ లో ఒకే వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువసార్లు ఉందంటూ కొన్ని, వ్యక్తులు చని పోయారంటూ మరికొన్ని, వలస వెళ్లారంటూ ఇంకొన్ని ఓట్లు తీసేశారు. అయితే నిజంగా అలాంటి పరిస్థితి ఉంటే అదేమి తప్పు కాదు.కానీ టీడీపీ ఓటర్లు, సానుభూతిపరులు, కార్యకర్తలకు సంబంధించిన ఓట్లే తీసేస్తున్నారని అంటున్నారు. గతంలో ఉరవకొండ నియోజకవర్గంలో ఇలాగే ఓట్ల తొలగింపుపై ఫిర్యాదులు వస్తే అధికారులు స్పందించకపోవడంతో నేరుగా కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు వచ్చారు. దీంతో అప్పటికప్పుడు ఓట్ల తొలగింపు నిజమేనని చెప్పి బీఎల్వోలపై చర్యలు తీసుకున్నారు. కానీ అలాంటివి రాష్ట్రం మొత్తం చోటు చేసుకున్నాయని అంటున్నారు. ప్రతిపక్షాల ఓట్లు మాత్రమే తొలగిస్తూ వైసీపీకి అనుకూలంగా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నా ఎన్నికల సంఘం మాత్రం చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. పైకి ఓటరు నమోదు, ఎలాంటి ఎన్నికల విధులనూ వాలంటీర్లకు అప్పగించొద్దంటూ ఆదేశాలివ్వటమే తప్ప.. గీత దాటుతున్న వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవట్లేదని ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయి ఆధారాలతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయాలని టీడీపీ నిర్ణయించుకుంది. ఈ ఓటర్ల జాబితా అంశం కీలక మలుపు తిరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పాత బస్తీలో బక్రీద్ ఆంక్షలు

**హైదరాబాద్:**

బక్రీద్ పండుగను పురస్కరించుకుని గురువారం మీరాలం ఈద్గాలో నిర్వహించనున్న సామూహిక ప్రార్థనల నేపథ్యంలో పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. మీరాలం ఈద్గా వైపు వచ్చే వాహనాలను ప్రార్థనలు ముగిసేంత వరకు దారి మళ్లించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయి. పురానాపూల్, కామాటిపురా, కిషన్‌బాగ్ నుంచి ప్రార్థనల కోసం మీరాలం ఈద్గాకు వచ్చే వాహనాలను బహదూర్‌పురా ఎక్స్ రోడ్డు మీదుగా రావాలని తెలిపారు. వీరు తమ వాహనాలను జూపార్కు ఏరియాలో, ఓపెన్ స్పేస్ ఎదురుగా మసీదు అల్లాహో అక్బర్ వద్ద పార్క్ చేసుకోవాలని సూచించారు. ఈ టైంలో సాధారణ వాహనాల రాకపోకలకు పర్మిషన్ లేదని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వీరిని బహదూర్‌పురా ఎక్స్ రోడ్డు వద్ద కిషన్‌బాగ్, కామాటిపురా, పురానాపూల్ వైపు దారి మళ్లించామని అని చెప్పారు. శివరాంపల్లి, దానమ్మ హట్స్ నుంచి ప్రార్థనల కోసం వచ్చే వాహనాలను దాన్నమ్మ హట్స్ ఎక్స్ రోడ్డు మీదుగా ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు అనుమతి ఉంటుంది. వీరు తమ వాహనాలను ఈద్గా ప్రధాన రహదారి ముందు, మోడ్రన్ సా మిల్ పార్కింగ్‌తో పాటు మీరాలం ఫిల్టర్ బెడ్, మీరాలం బెడ్ పక్కన ఖాళీ ప్లేస్ లో, కార్లను, యాదవ్ పార్కింగ్ పక్కన పార్క్ చేసుకోవాలని తెలిపారు. ఈ టైంలో ఇతర వాహనాల రాకపోకలను ఈద్గా వైపు పర్మిషన్ లేదన్నారు.సాధారణ వెహికిల్స్ ను దానమ్మ హట్స్ ఎక్స్ రోడ్డు దగ్గర శాస్త్రిపురం, నవాబ్‌సాబ్‌కుంట తదితర ప్రాంతాల నుంచి దారి మళ్లించనున్నట్లు నగర పోలీసులు తెలిపారు. కాలాపత్తర్, మీరాలం ట్యాంక్ వైపు నుంచి వాహనాలను కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ మీదుగా ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు అనుమతించమన్నారు. వీరు తమ వాహనాలను భయ్యా పార్కింగ్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద పార్క్ చేసుకోవాలని సూచించారు. సాధారణ వాహనాలను కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ వద్ద మోచీ కాలనీ, బహదూర్‌పురా, షంషీర్‌గంజ్, నవాబ్‌సాబ్‌కుంట వైపు మళ్లించారు. పురానాపూల్, బహదూర్‌పురా వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులతో పాటు భారీ వాహనాలను పురానాపూల్ దర్వాజా వద్ద జియగూడ, సిటీ కాలేజీ వైపు దారి మళ్లించ నున్నార న్నారు. ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు శంషాబాద్, రాజేంద్రనగర్, మైలార్ దేవ్‌పల్లి నుంచి బహదూర్‌పురా వైపు వచ్చే అన్ని ఆర్టీసీ బస్సులతో సహా భారీ వాహనాలను ఆరాంఘర్ జంక్షన్ దగ్గర శంషాబాద్, రాజేంద్రనగర్, మైలార్ దేవ్‌పల్లి వైపు దారి మళ్లించనున్నారు.

# ఇకపై వాట్సప్ ద్వారా గ్యాస్ బుకింగ్

**హైదరాబాద్ :**

ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల బుకింగ్ ఇకపై వాట్సప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. ఈ మేరకు ఆయిల్ కంపెనీలు తాజాగా కొత్త పద్ధతిని ప్రవేశ పెట్టాయి. వాట్సప్ ద్వారా హెచ్‌పీ, భారత్ గ్యాస్, ఇండెన్.. వంటి పలు కంపెనీల గ్యాస్ సిలిండర్లను బుకింగ్ చేసుకునే వెలుసుబాటు కల్పించాయి. సాధారణంగా గ్యాస్ వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీ నంబర్ లేదా ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్‌కు కాల్ చేయడం ద్వారా లేదా కంపెనీ వెబ్‌సైట్‌లో ఆర్డర్ చేయడం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌లను బుక్ చేసుకుంటుంటారు. ఇందుకోసం ఏజెన్సీల చుట్టూ తిరుగుతూ, లెక్కలేనన్ని ఫోన్ కాల్స్ చేస్తూ వినియోగదారులు ప్రయాస పడుతుం టారు. రీఫిల్ బుకింగ్ సులభతరం చేసేందుకే ఈ పద్ధతిని ప్రవేశపెట్టినట్లు చమురు సంస్థలు తెలిపాయి.తాజాగా ప్రవేశ పెట్టిన కొత్త విధానం ద్వారా సదరు కంపెనీ వాట్సాప్ నంబర్‌కు నేరుగా ఒక్క మెసేజ్ పెట్టి సిలిండర్ సులువుగా బుక్ చేసుకోవచ్చు. అలాగే కొత్త కలెక్షన్ కూడా వాట్సాప్ ద్వారా పొందవచ్చు. అందుకు వాట్సప్‌లో కొత్త కనెక్షన్ ఆప్షన్ ఎంపిక చేసుకుంటే చాలు..! ఐతే గ్యాస్ వినియోగదారుల కోసం వాట్సాప్ సేవలు తీసుకొచ్చినా వినియోగించే వారి సంఖ్య మాత్రం చాలా తక్కువగా ఉందని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 42 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిల్లో యూపీఐ డిజిటల్ వ్యాలెట్ ద్వారా 15 శాతం, ఫోన్‌కాల్స్ ద్వారా 75 శాతం, వెబ్‌సైట్ వంటి ఇతర పద్ధతుల ద్వారా 10 శాతం మంది వినియోగించుకుంటున్నారు. వినియోగదారులకు సరైన అవగాహన లేకపోవడం వల్లే వాట్సప్ సేవలు వినియోగించుకోలేకపోతున్నారని వారు అభిప్రాయపడుతున్నారు.మీరు హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులైతే.. హెచ్‌పీ వాట్సాప్ నంబరు 92222 01122లో :తి అని టైప్‌చేసి సెండ్ చేయాలి. ఆ త్వరాత వచ్చే మెనూలో పలురకాల సేవలు వస్తాయి. వాటిల్లో అవసరమైన ఆప్షన్ ఎంపిక చేసుకుంటే సరిపోతుంది. 'సువిధ' ఎంపిక త్వారా కొత్త కనెక్షన్, కనెక్షన్ తొలగింపు వంటి సేవలు పొందొచ్చు. అలాగే ఇండేన్ కంపెనీ వాట్సప్ నెంబర్ 75888 88824, భారత్ గ్యాస్ వాట్సప్ నెంబర్ 18002 24344.

# కర్ణాటక సర్కార్ ప్రభుత్వంలో లుకలుకలు

**నేను సీఎంలా బ్యాక్ స్టెప్ వేయనంటున్న డిప్యూటీ సీఎం**

**బెంగళూరు :**

కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్. .ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై స ంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నో రోజులుగా వివాదాస్పదం అవుతున్న స్టీల్ ఫ్లై ఓవర్ ప్రాజెక్ట్ విషయంలో ప్రజల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అందుకే సిద్దరామయ్య ఈ ప్రాజెక్ట్‌పై వెనక్కి తగ్గాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే డీకే శివకుమార్ సిద్దరామయ్యకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. "ప్రజలు ఎంత ఒత్తిడి చేసినా తాను సిద్దరామయ్య లాగా భయపడే వాడిని కాదు" అని అన్నారు. విధాన సౌధలో కెంపెగౌడ జయంతి సందర్భంగా ఓ కీలక భేటీలో పాల్గొన్నారు డీకే శివ కుమార్. ఆ సమయంలోనే రాష్ట్రంలో చేపట్టాల్సిన పలు ప్రాజెక్ట్‌లు ప్రస్తావనకు వచ్చాయి. బెంగళూరులో ఫ్లై ఓవర్‌లు, టన్నెల్స్ నిర్మించాలన్న ప్రతిపాదన వచ్చింది. గతంలో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్ ప్రస్తావన రాగా...ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని భావించిన సిద్దరామయ్య వెంటనే దాన్ని పక్కన పెట్టారు. దీన్ని ప్రస్తావిస్తూనే డీకే ఇలా మాట్లాడారు. పైగా...ఇప్పుడాయన బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్ మినిస్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఈ కామెంట్స్ చేయడం సంచలనమవుతోంది. "గతంలో సిద్దరామయ్య ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్టీల్ బ్రిడ్జ కట్టాలని భావించారు. కానీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ ప్రాజెక్ట్‌లో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలూ వచ్చాయి. దీంతో సిద్దరామయ్య భయపడిపోయారు. అప్పటి బెంగళూరు సిటీ డెవలప్‌మెంట్ మినిస్టర్ కేజే జార్జ్ కూడా వెనక్కి తగ్గారు. ఇద్దరూ కలిసి ఆ ప్రాజెక్ట్‌ని అటకెక్కించారు. ఒకవేళ అప్పుడు సిద్దరామయ్య ప్లేస్‌లో నేను ఉండి ఉంటే అసలు భయపడే వాడిని కాదు. నా దారిలో ఎవరు అడ్డం వచ్చినా ఆ అడ్డు తొలగించుకునే వాడినిఇదే సమయంలో ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన కీలక వివరాలు వెల్లడించారు డీకే శివకుమార్. బసవేశ్వర సర్కిల్ నుంచి హెబ్బాల్ జంక్షన్ వరకూ దాదాపు 6-7 కిలోమీటర్ల మేర ఈ స్టీల్ బ్రిడ్జ్‌ని నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకోసం రూ. 1,761 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేశారు. అయితే..ఇందు కోసం దాదాపు 800 చెట్లను నరికేయాల్సి వస్తుందని అధికారులు వెల్లడించారు. ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడం వల్ల వెంటనే అప్పటి సిద్దరామయ్య ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇప్పుడు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసి తీరతానని స్పష్టం చేశారు డీకే శివకుమార్. ఎవరు అడ్డం వచ్చినా ఆగనని తేల్చి చెప్పారు. సిటీలోని రోడ్లపైనా దృష్టి సారించి ఆ సమస్యకూ పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. వీటితో పాటు నగర శివార్లలో శాటిలైట్ సిటీలనూ నిర్మించాలని ప్లాన్ చేస్తోంది సిద్దరామయ్య ప్రభుత్వం. బెంగళూరుపై ఒత్తిడి తగ్గించేందుకు..శివార్లలో ప్రత్యేకంగా విల్లాలు నిర్మించి అక్కడా మొబిలిటీ పెంచాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన మ్యాప్‌నీ సిద్ధం చేసినట్టు సమాచారం.

# సైకోను ఎమ్మెల్సీ ని చేసారు-ఈటల రాజేందర్

**హన్మకొండ**

హుజూరాబాద్ లో వందలకొట్లు ఖర్చు పెట్టినా గెలవలేదు అని, ప్రజలకు ఆయన పద్దతి రుచి చూపించేందుకు ఒక సైకోకు ఎమ్మెల్సీ ఇచ్చి నన్ను హింస పెట్టే పని చేస్తున్నారని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఆరోపించారు. బుధవారం నాడు అయన ఖాజీపేట రైల్వే స్టేషన్ లో మీడియాతో మాట్లాడారు. ప్రజలందరినీ, అణగారిన వర్గాల వారిని బెదిరించడం చేస్తున్నారు. ప్రెస్ వారిని కూడా భయపెదుతున్నారు. అసలే పిచ్చోడు వాడికి ప్రగతి భవన్ అండగా ఉంది అని నేను సైలెంట్ గా ఉన్నా.. సీఎం ఆయనకు ఒక స్పెషల్ టాస్క్ ఇచ్చారని తెలిసిందని అన్నారు.పంగిడిపల్లిలో మా మీద దాడి చేశారు. ప్లాన్డ్ గా దాడి చేశారు. పోలీసులు మాత్రం మా వాళ్ళను పట్టుకుపోయు కొట్టి కేసులు పెట్టారు. మొన్న జీఎస్ఆర్ టీవీ కెమెరామన్ వీడియో తీశారని అతని కొట్టే సందర్భంలో.. అతని కులం ముదిరాజ్ అని చెప్పగానే వీరంగం వేశారు. ఇష్టం వచ్చినట్టు బూతులు తిట్టారు. ఈటల రాజేందర్ ను 20 కోట్లు ఇచ్చి చంపుతామని చెప్పినట్టుగా ఆడియో రికార్డ్ అయ్యింది. వాటిపై కంప్లైంట్ ఇచ్చాము. ఇవన్నీ ప్రగతి భవన్ కేంద్రంగా కెసిఆర్ చేస్తున్న పనులని విమర్శించారు. ఈ పనులు ఆపకపోతే హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో, జమ్మికుంట గాంధీ చౌరస్తాలో చెప్పులు మెడలో వేసి తిప్పుతాం అని నిన్నే మా వాళ్ళు చెప్పారు. నయీం కే భయపడలేదు. సాంబశివుడు ను చంపినప్పుడు అక్కడికి వెళ్ళినప్పుడు నేను మాట్లాడుతూ నయీం ను కుక్క చావు చస్తావు అని చెప్పా. అప్పుడు అనేక బెదిరింపులకు దిగారు. అయినా భయపడలేదు. ఇప్పుడు సీఎం చిల్లర గాల్లతో దాడి చేయిస్తా అని అంటే భయపడతానా అని అన్నారు. హుజూరాబాద్ లో జరిగే అరాచకాలపై అనేక సార్లు సీపీ లకు చెప్పినా. నీ కరీంనగర్ సిపి స్పందించలేదు. నీచుల శాడిస్ట్ లను ప్రేరేపిస్తే ఖబడ్దార్. నీ వెంబడి పడతా. కేటీఆర్ నా భద్రత గురించి మాట్లాడినట్లు తెలిసింది. కెసిఆర్ హెచ్చరిస్తున్నా నీ తాత జాగీరు కాదు. రక్షణ కల్పించాల్సిన భాధ్యత ప్రభుత్వానిదే.. కేంద్ర భద్రత ఇస్తుంది అని కూడా టీవీ లోనే చూసా.. ఐబి నివేదిక ఇచ్చివుంటుంది. పోలీసుల రక్షణ కాదు.. ప్రజలే రక్షించుకుంటారు. ఎమ్మెల్సీ నీ వెంటనే బర్తరఫ్ చెయ్యాలి అని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

# పెండింగ్ లో ఉన్న ఉపాధి హామీ వేతనాలు చెల్లించండి

**ఆదోని**



మండల పరిధిలోని గోన్ బావి, పాండవగల్లు, గ్రామాలలోజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ఎనిమిది వారాలుగా (రెండు నెలలు) వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ కూలీలు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే లింగన్న, మండల నాయకులు కే గోవిందు,ఆయా గ్రామాల నాయకులు ప్రసాద్, వీరప్ప ఆంజనేయ, దేవయ్య,మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ప్రకారం పనిచేసిన 15 రోజుల్లో గా వేతనాలు చెల్లించాలని కానీ రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క వారం వేతనం కూడా అంద లేదని అన్నారు. వచ్చిన అరకొర వర్షాలకు విత్తనాలు వేసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇంటి ఖర్చులకోసం చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి పెండింగ్ బిల్లులుచెల్లించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని అదేవిధంగా నిత్యవసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే, ఏమి తిని బ్రతకాలని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా వెంటనే ఉపాధి హామీ వేతనాలు చెల్లించాలనిలేనిపక్షంలో ఎనిమిది వారాల ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించేంతవరకు పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

# నరేంద్రమోదీ ప్రభుత్వం 9 ఏళ్ళ పాలనలోనే విశాఖపట్నం మున్సిపల్ అభివృద్ధి

**అల్లూరి**

విశాఖపట్నం జిల్లా తూర్పు నియోజకవర్గ మున్సిపల్ 12 వ వార్డ్ లో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి,అసెంబ్లీ కన్వీనర్ మురళీమోహన్ రాజు ఆధ్వర్యంలో నరేంద్రమోడీ ప్రభుత్వ 9 ఏళ్ళ పరిపాలన పూర్తి అయిన సందర్భంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఇచ్చిన నిధులు మరియు సంస్థలు వివరాలు కరపత్రాలు ఇంటింటికీ పంచి ప్రచారం చేయడం జరిగిందని. ఈ కార్యక్రమనకి ముఖ్యాతిధిగా బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు కురుసా ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ను మంజూరు చేసింది నరేంద్రమోదీ ప్రభుత్వం. ఆలాగే విశాఖపట్నం నుండి సికింద్రాబాద్ మధ్య,సికింద్రాబాద్ నుండి తిరుపతి మధ్య రెండు వందే భారత్ ట్రైన్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం మోదిదే.ఇంకా విశాఖపట్నం నగర అభివృద్ధికి,62 ప్రాజెక్టులకు రూ. 2077.23 కోట్లు నిధులు మంజూరు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధ్యక్షులు జిల్లా నాయకులు రాజు, పెద్దారెడ్డిల పద్మ మరియు జిల్లా వార్డ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై అదనపు సుంకం తగ్గింపు నష్టదాయకం - ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి

**బద్వేలు**




అమెరికా పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన దేశ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించే అనేక ఒప్పందాలపై సంతకాలు చేయడం చాలా అన్యాయమని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి తెలిపారు బుధవారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బటానీలు, ఆపిల్, మెంతులతో సహా 8 వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై ప్రస్తుతం ఉన్న అదనపు సుంకాలను ఎత్తివేస్తామని ప్రకటించి సంతకాలు చేయడం పట్ల అమెరికాకు మోడీ సర్కార్ మోకరిల్లడం చాలా బాధాకరమైన విషయమని ఆయన తెలిపారు. భారత్ తో పోలిస్తే అమెరికా రైతులకు అందే రాయితీలు చాలా ఎక్కువ, వారు సాగు చేసే విస్తీర్ణం కూడా అధికమే పూర్తిస్థాయి యాంత్రీకరణ మూలాన సాగు ఖర్చులు కలిసి వస్తాయి అంత భారీ స్థాయిలో ఉత్పత్తిదారుల నుంచి వ్యవ సాయ పంటలను ఇక్కడకు దిగు మతికి చేయడం ళలన దేశంలో సన్న కారు రైతులు ఆ పోటీలో నిలిచి గట్టెక్కలేరని తీవ్ర నష్టాలు చవిచూస్తారని దీనివల్ల దేశ వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకు పోతుందని ఆయన తెలిపారు. భారత్ నుంచి ఉక్కు అల్యూమినియం ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకు ప్రతిగా ఈ ఒప్పందానికి మోడీ సర్కార్ అంగీకరించినట్లు తెలుస్తుం దన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు

## గోదావరిఖనిలో గుజరాత్ ఏటీఎస్ పోలీసుల తనిఖీలు

**ఒక కుటుంబాన్ని అదుపులో తీసుకున్న పోలీసులు**

**పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శ్రీనగర్ కాలనీకి చెందిన ఓ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాన్ని గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్ రాష్ట్రానికి చెందిన యాంటీ టెర్రరిస్ట్ గ్రూప్ పోలీసులు అక్కడి నుండి ప్రత్యేక వాహనం ద్వారా గోదావరిఖనికి వచ్చారు. గోదావరిఖని లోని శ్రీనగర్ కాలనీలో ఉంటున్నారన్న సమాచారం అందుకున్న గుజరాత్ ఆంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ బృందం మంగళవారం రాత్రి మహమ్మద్ జావిద్ (46) తో పాటు అతని కూతురు ఖతిజా (19) ను అదుపులోకి తీసుకున్నారు. జావిద్ హైదరాబాద్ లోని అమీర్పేట్ లో ఓ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లో సాఫ్ట్ వేర్ ట్రైనర్ గా పనిచేస్తున్నట్లు తెలిసింది. తండ్రి కూతుర్లు టోలి చౌక్ లో నివాసం ఉంటున్నారు. బక్రీద్ పర్వదినం కోసం తండ్రి కూతుర్లు గోదావరిఖనికి వచ్చినట్టు సమాచారం. గతంలో జరిగిన పేలుళ్లతో సంబంధం ఉన్న జావేద్ ను అతని సన్నిహితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకునట్లు సమాచారం. వీరిని రామగుండం పోలీస్ కమిషనరేట్ కు పంపించి అక్కడి నుంచి హైదరాబాద్కు వెళ్ళినట్లు తెలుస్తుంది.

## సివిల్స్ మెయిన్ పరీక్షలకు ఉచిత కోచింగ్

**హైదరాబాద్ :**

యూపీఎస్సీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్ పరీక్షలకు ఉచిత కోచింగ్ ఉచ్చేందుకు ఉస్మానియా యూనివర్సిటీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. బీసీ నిరుద్యోగ అభ్యర్థులకు జూలై 31 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు ఓయూ క్యాంపస్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్ ఉచిత కోచింగ్ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి 150 మందిని ఎంపిక చేయనున్నారు. తొలి 50 మందిని మెరిట్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారు. మరో 100 మందిని స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి ఆశన్న తెలిపారు. అందుకు జూలై 16న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నారు. సివిల్స్ ఉచిత శిక్షణకు ఎంపికైన వారికి వసతి, భోజన సదుపాయం, రవాణా ప్రయోజనాల కోసం నెలకు రూ.5,000 చెల్లిస్తారు. అలాగే ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు రూ.5,000 విలువైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందిస్తారు. అంతేకాకుండా లైబ్రరీ సౌకర్యం కూడా ఉంటుంది. ఈ అవకాశాన్ని నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో అధికారిక వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నం: 040-24071178 కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

## చెల్లెలు భర్తను చంపేసిన అన్న

**కరీంనగర్**

భార్యకు అనారోగ్యంగా ఉండటంతో చెల్లెలి కమ్మలు తాకట్టు పెట్టి.. ఆ డబ్బుతో భార్యకు వైద్యం చేయించాడో వ్యక్తి. ఆ విషయం తెలుసుకున్న చెల్లెలి భర్త బావమరిదిని ఘోరంగా చావబాది హతమార్చాడు. ఈ విషాద ఘటన జగిత్యాల జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. జగిత్యాల టౌన్ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాల ప్రకారం..జగిత్యాల జిల్లా మిషన్ కంపౌండ్ ప్రాంతానికి చెందిన శివరాత్రి రమేశ్ (28) భార్య శైలజ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో భార్యకు వైద్యం చేయించేందుకు చెల్లెలి అనుమతితో ఆమె కమ్మలు తాకట్లు పెట్టి వచ్చిన డబ్బుతో భార్యకు చికిత్స చేయించాడు. ఈ విషయం తెలుసుకున్న రమేశ్ బావ నాగదరి యాకుబ్ తన భార్య చెవికమ్మలు వెంటనే తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం రాత్రి (జూన్ 26) యాకుబ్‌కు, అతని బావమరిది రమేష్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.కోపోద్రిక్తుడైన యాకుబ్ రమేశ్‌పై విచక్షణా రహితంగా దాడి చేసి చావబాదాడు. దీంతో రమేష్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే బాధితుడిని జగిత్యాల జిల్లా దవాఖానకు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. రమేశ్ భార్య శైలజ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపాడు.

## శ్రీ చైతన్య కళాశాలకు తాళం వేసిన ఎస్ఎఫ్ఐ నేతలు

**శ్రీకాకుళం**



శ్రీకాకుళం పట్టణంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ( ఎస్ఎఫ్ఐ) శ్రీకాకుళం జిల్లా కమిటీ నాయకులు శ్రీ చైతన్య కళాశాలలో పాఠ్యపుస్తకాల అమ్మకాలును అడ్డుకున్నారు. ఈ మేరకు కళాశాల యాజమాన్యం ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ విక్రయించడానికి ప్రయత్నిస్తున్న తరుణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకొని గదికి తాళం వేశారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల ఏజీఎం తిరుపతిరావు ఇకపై కళాశాలలో పుస్తకాలు, యూనిఫామ్స్ గాని విక్రయించమని లిఖితపూర్వకంగా రాసి ఎస్ఎఫ్ఐ నాయకులకు అందజేసారు.

ఈ సదర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ రాజు బి హరీష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నాయకులు సంతోష్, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి బాధ్యతను పెంచుతుంది

**జగిత్యాల**



పదోన్నతులు బాధ్యతలను పెంచుతాయని జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. జిల్లాలో ఇన్స్పెక్టర్లుగా పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డీఎస్పీలుగా పదోన్నతి పొందిన రాజశేఖర్ రాజు, శ్రీనివాస్ లు బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన అధికారులను జిల్లా ఎస్పీ అభినందించి, పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేశారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ ఎన్నో ఏళ్లుగా ప్రజా సంరక్షణ కోసం అవిశ్రాంతంగా చేస్తున్న కృషికి పదోన్నతి ఒక గొప్ప గుర్తింపు అన్నారు. పదోన్నతి అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక మైలురాయి వంటిదని అన్నారు. ముఖ్యంగా పోలీస్ శాఖలో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించవలసి ఉంటుందని ఎస్పీ భాస్కర్ అన్నారు..

## ఆత్మ ప్రాజెక్టు డిడి మృతి

**ఏలూరు**



ఏలూరు జిల్లా ఆత్మ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్ గా గద్దె తిరుపేటయ్య (60) ఈ నెల 3 వ తేదీన అనంతపూర్ జిల్లానుంది ఏలూరు ఆత్మ కార్యాలయానికి బదిలీ పై వచ్చారు .అప్పటి నుండి విధులు చేపట్టారు. అప్పటినుండి ఏలూరులో తాత్కాలికంగా ఉండేందుకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న కంప్యూటర్ షాపింగ్స్ వెనుక ఉన్న మీసేవా కేంద్రం వెనుక గదిలో ఉంటున్నారు.ఏమైందో ఏమో గాని మంగళ వారం తిరుపేటయ్య విధులకు హాజరు కాకపోవడం తో ఆత్మ కార్యాలయ సిబ్బంది అటెండర్ తో కిటికీ తలుపులు నుండి పరిశీలించగా సదరు డిప్యూటీ డైరెక్టర్ తిరుపతయ్య మృతి చెందినట్టుగా గుర్తించారు

## స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

**బద్వేలు**



స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న 15 నెలల జీతాలను వెంటనే విడుదల చేయాలని బద్వేల్ ఏఐటీయూసీ ఏరియా సహాయ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానియేల్ ప్రభుత్వాన్ని కోరారు స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం బద్వేలు మండల అభివృద్ధి అధికారికి సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఇమ్మానియేలు మాట్లాడుతూ సర్పంచులకు 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి క్లాస్ మిత్రులకు వేతనాలు చెల్లించాలన్న ప్రభుత్వ ఆదేశాలు క్రింది స్థాయిలో అమలుకు నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 680 ప్రకారం కనీస వేతనం 10000 రూపాయలు ఇవ్వాలని వారికి గుర్తింపు కార్డులు యూనిఫాం పనిముట్లు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు సీఎం సొంత జిల్లాలోనే స్వచ్ఛభారత్ కార్మికులు జీతాలు అందక కుటుంబం గడవక పని భద్రత లేక దుర్భరమైన జీవితం గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోయారు ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజా ఆరోగ్య రక్షణకై యుద్ధ ప్రాతిపదికన వేతనాలు అందించాలన్నారు లేని పక్షంలో స్వచ్ఛభారత్ కార్మికులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు స్వచ్ఛభారత్ కార్మికులు ఆనందరావు ఓబయ్య లక్ష్మణ్ గోపయ్య తదితరులు పాల్గొన్నారు

## డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం

**ఆత్మకూరు**



నెల్లూరు జిల్లా ఆత్మకూరు స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో (సబ్) సి ఐ నయనతార కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారుల సూచనల మేరకు మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి డ్రగ్ సహిత సమాజం కోసం మనమందరం కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ డ్రగ్స్ కి అలవాటు పడి ఉజ్వల భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని ఎవరైనా మాదకద్రవ్యాలకు అలవాటు పడిన, వాటిని ప్రోత్సహిస్తున్న వారిని గమనించి వారి వివరాలు తమకు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యతగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ,సబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హ్యాట్సాఫ్ మహ్మద్ భాయ్



**గద్వాల్**

నిత్యం దుకాణం ముందు రోడ్డుపై గుంతలలో పడుతూ వెళ్తున్న సంఘటనలను కళ్ళార చూసిన అహ్మద్ టిఫిన్ సెంటర్ యజమాని మహ్మద్ భాయ్ సొంత ఖర్చులతో ఆ గుంతను పూడ్చి వేసే పనిని ఎంచుకున్నారు.అటుగా వందల పర్యాయాలు అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్తున్నా నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తుండటంతో ఎవరికి చెప్పినా ఏమి లాభం అనుకుని పని పూర్తి చేశారు.నడిరోడ్డుపై గుంతను పూడ్చుతున్న మహ్మద్ భాయ్ ను చూసిన వారందరూ హ్యాట్సాఫ్ మహ్మద్ భాయ్ అంటూ అటుగా వెళ్తున్నారు. ఇలాగే ప్రజలందరూ వారి వారి దుకాణాల ముందు, ఇళ్ల ముందు ఇలా గుంతలు పడినా, చెత్త పడినా మీది ఏ దారి అంటే గోదారి అన్నట్టుగా వ్యవహరించే వారిని అడగకుండగా ఎవరిది వారు తీసేసుకోవడం ,పూడ్చుకోవడం అలవాటు చేసుకుంటే మంచిది అనుకుంటున్నారు పట్టణ ప్రజలు.

## పవన్ నాకు అన్న లాంటి వాడు

**హైదరాబాద్ :**

ఏపీ రాజకీయాలపై మంత్రి కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఏపీలోనూ పోటీచేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ మాత్రమే ఏపీ ప్రయోజనాలను కాపాడగలరని చెప్పుకొచ్చారు. ప్రజలు అనుకుంటే ఏదైనా జరుగుతుందన్నారు. సీఎం జగన్ జగన్, లోకేశ్, పవన్ తో తనకు ఉన్న సంబంధాల గురించి వివరించారు. మోడీ అయినా.. మరెవరైనా భయపడే ప్రసక్తే లేదని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పేర్కొన్నారు. తెలంగాణ మంత్రి కేటీఆర్ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో పవన్ కళ్యాణ్ గురించి కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అవి కాస్త నెట్టింట్లో వైరల్ అయ్యాయి.. తనకు పవన్ మంచి ఫ్రెండ్ గా కేటీఆర్ పేర్కొన్నారు. తనకు అన్న లాంటి వాడని చెప్పారు.పలు సందర్భాల్లో కలుసుకున్నామని.. అనేక విషయాలు మాట్లాడుకున్నామని వెల్లడించారు. అనేక అంశాల్లో తమ అభిరుచులు కలుస్తాయని కేటీఆర్ వివరించారు. పవన్ కు సాహిత్యం అంటే ఇష్టమని చెప్పిన కేటీఆర్?తనకు కూడా సాహిత్యం అంటే కొంత ఆసక్తి ఉందన్నారు. తనకు అందరూ స్నేహితులేనని కేటీఆర్ చెప్పుకొచ్చారు. రాజకీయాలకు..స్నేహలకు సంబంధం లేదన్నారు. ఎవరి రాజకీయాలు వారివి.. ఆయన రాజకీయాలు ఆయనవి.. నా రాజకీయాలు నావి.. ఏపీలో నారా లోకేష్ కూడా బాగా తెలుసు.. జగనన్న కూడా మంచి ఫ్రెండ్.. నాకు అందరు స్నేహితులే.. ఎవరితో ఎలాంటి ఇబ్బందులు లేవు.. అంటూ రాజకీయాలు రాజకీయాలే.. మా స్నేహాలు మావే అన్నట్టు కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇక కేటీఆర్ మాట్లాడుతూ మా పార్టీ కూడా ఏపీలో పోటీ చేస్తుందని.. బీజేపీని వ్యతిరేకించే గొంతు బీఆర్ఎస్ కు మాత్రమే ఉందన్నారు. సీఎం కేసీఆర్ మాత్రమే ఏపీ ప్రయోజనాలను కాపాడగలరన్నారు.

## పీవీకి భారతరత్న ఇవ్వాలి...

**పివి నరసింహారావు సేవలలు మరువలేం**

**పూల మాలవేసి నివాళులర్పించి, జయంతి వేడుకలు**

**ఎమ్మిగనూరు**

జిల్లా ఓబీసీ చైర్మన్ ఎం కాశీం వలి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలో బుధవారం రోజున మాజీ ప్రధానమంత్రి వర్యులు పీవీ నరసింహారావు గారి జయంతి వేడుకల సందర్భంగా ఒకేషనల్ కళాశాలలో పూలమాల వేసి నివాళులర్పించి, విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది, కేంద్రం పివికి భారతరత్న ఇవ్వాలని తెలుగుజాతి ముద్దుబిడ్డ బహుభాషా గోవిందుడు పీవీ నరసింహారావు గారు అని తెలియజేశారు. పీవీ నరసింహారావు గారి ప్రధానమంత్రి హయాంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనదన్ని తెలిపారు. అనేక సంఘసంస్కరణ ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. అనేక పథకాలను జాతీయకరణ చేసిన ఘనత ఈయనదే . పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. తెలుగు రాష్ట్ర అభివృద్ధి కొరకు అనేక పథకాలు చేపట్టారు ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు వై జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్, అజయ్ విద్యార్థులు పాల్గొన్నారు

## మంత్రి పర్యటనలో అపశృతి

**బేతంచర్ల,**

మంత్రి పర్యటనలో అపశృతిమంత్రి బుగ్గనపై తేనెటీగల దాడి.మంత్రిపై టవాలు కప్పి రక్షించిన అంగరక్షకులు బేతంచర్ల, ఉదయం న్యూస్: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి బేతంచర్ల మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను శంకుస్థాపన చేసే కార్యక్రమంలో భాగంగా బేతంచెర్ల మండలంలోని కనుమకింది కొట్టాల గ్రామంలో వెలసిన బిల్వ సర్గం గుహలలో చేపట్టిన ప్రహరీ పనులను పరిశీలించేందుకు బుధవారం నాడు పరిశీలిస్తున్న క్రమంలో ఒక్కసారిగా అక్కడున్న తేనెటీగల గుంపు దాడి చేయడంతో రెవిన్యూ సిబ్బంది, జర్నలిస్టులు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు దాదాపుగా 40 మంది గాయపడ్డారు. వీరిని బేతంచర్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని కర్నూల్ లోని ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు. వీరిని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, నాగభూషణం రెడ్డి, ఎమ్మార్వో, ఆర్డీవోలు పరామర్శించారు. గత మూడు నెలల క్రితం కూడా ఇదే తరహాలో తినతిగల దాడి జరగడంతో అందులో దాదాపుగా పదిమంది తేనెటీగల దాడిలో గాయపడిన విషయం తెలిసిందే ఇది రెండోసారి కావడం విశేషం దీనిపై అధికారులు తగు జాగ్రత్త తీసుకోవాలని కోరుతున్నారు.

## రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలి -సిపిఐ

**వెలుగోడు :**

వెలుగోడు నుండి వెంపేట రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని సిపిఐ (యంయల్) ఆర్ ఐ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ వెలుగోడు మండలం లోని వెంపేటకు ప్రయాణమంటే అస్తవ్యస్తంగా నల్లేరు మీద నడక లాగా తయారైయిందని వారు ఎద్దెవా చేశారు. శ్రీశైల నియోజకవర్గం లో సమస్యలు కోకొల్లలుగా ఉన్న వాటిని పరిష్కరించడం లో అధికారులు నాయకులు వెనుకనంజలో వున్నారని ఆయన ఆరోపించారు అభివృద్ధి కి ఆమడ దూరంలో ఉన్న నియోజకవర్గం లో ఏమి వెలగబెట్టారని వైసిపి నేతలు సంబరాలు జరుపుకుంటున్నారో అర్థం కాని పరిస్థితి లో జనాలు వున్నారన్నారు ఇకనైనా అధికారులకు నాయకులకు చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని వారు డిమాండ్ చేశారు.

## రాజధానికోసం పాదయాత్ర

**అమరావతి**

రాజధాని నుండి రాజధాని కోసం పాదయాత్ర చేస్తున్నామని, ఉమ్మడి రాజధాని హైదరాబాద్ ఎన్టీఆర్ ఘాట్ నుండి అమరావతి ప్రధాని మోడీ శంఖుస్థాపన చేసిన స్థలం వరకు జులై 17 న పాదయాత్ర చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి నాయకులు కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు...రాజధానిలో నివాసాల కోసం, వ్యాపారాల కోసం వివిధ వర్గాల ప్రజలు అమరావతి ఉద్యమానికి మద్దతు ఇచ్చారని, అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మారిందని, మూడు రాజధానుల విధానానికి వ్యతిరేకంగా రైతులు కోర్టుకు వెళ్లారని వివరించారు...హై కోర్ట్ రాజధాని మార్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని తీర్పు ఇచ్చింది..హై కోర్ట్ తీర్పుకు వ్యతిరేకంగా వైకాపా ప్రభుత్వం సుప్రీం కి వెళ్తారని రాష్ట్ర ప్రజలు అనుకున్నారని కానీ 6 నెలలు తాత్సారం చేసి అసెంబ్లీ వేదికగా హై కోర్ట్ తీర్పుపై దారుణమైన వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు...అదే విధంగా ఈ కేస్ లన్ని విచారణ దశలో ఉండగా, రాజధాని మాస్టర్ ప్లాన్ ని విచ్ఛిన్నం చేస్తూ...సెంటు స్థలాలు ఇచ్చారని, ఆర్ 5 జోన్ పేరుతో రాజధానిలో అరాచకానికి తెర తీసిందన్నారు...5 శాతం పేదలకు ఇవ్వాలి అనే నిబంధన ఉన్నా దాన్ని పట్టించుకోకుండా రాజధాని విచ్ఛిన్నం చేస్తున్నారని, ఒక క్రిమినల్ మైండెడ్ బిసినెస్ మాన్ విత్ పొలిటికల్ పవర్, దేశంలో ఇలాంటి వ్యక్తిని ఎక్కడా చూడలేదని, ఒక ప్రాంతం,ఒక కులం పై కక్ష కట్టి పేదల పేరుతో రాజధాని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు

# శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

**మంత్రాలయం**



ఏఐఎస్ఎఫ్ రాయలసీమ జిల్లాల శిక్షణా తరగతులను జూలై 4,5,6 తేదీలలో మంత్రాలయంలో నిర్వహిస్తున్నామని, వాటిని జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ్,జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర, థామస్ లు పిలుపునిచ్చారు.బుధవారం శిక్షణా తరగతులకు సంభందించిన కరపత్రాలను ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్పచెప్పి విద్యను మొత్తం ప్రైవేటీకరణ చేస్తున్నారు. దీంతో మధ్య తరగతి ప్రజలు చదువుకోవడం మానేస్తున్నారు.దేశంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పి పాఠ్యపుస్తకాలలో రాజ్యాంగ చరిత్రను చేరిపేస్తున్నారు.రాష్ట్రంలో రేషనలైజేషన్ పేరుతో ఉన్న స్కూళ్లను కుదించి ప్రభుత్వ విద్యను ధ్వంసం చేస్తూ మిగులు ఉపాధ్యాయ పోస్టులు చూపిస్తున్నారని, అదేవిధంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలను కూడా విద్యార్థులే కొనుగోలు చేయాలని చెప్పడం ప్రభుత్వ విద్యపై చిత్తశుద్ధి ఏమాత్రం ఉందో అర్థం చేసుకోవచ్చని వారు తెలిపారు.నూతన జాతీయ విద్యావిధానం తీసుకొచ్చి విద్యార్థులపై రుద్దితే విద్యార్థులకు అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, తక్షణమే ఎన్సీఈఆర్టీ పుస్తకాలలో ఉన్న పాఠ్య భాగాలు యధావిధిగా కొనసాగించాలని,దానిని వ్యతిరేకిస్తూ రాజీనామా చేసిన కూడా కేంద్రానికి సిగ్గులేకుండా ముందుకు వెళ్లడం ముర్కపు చర్య అని అన్నారు.జూనియర్ కళాశాల విద్యార్థులకు మిరే పుస్తకాలు కొనుక్కోండి అని ఆదేశాలు జారీ చేయడం చాలా దుర్మార్గపు ఆలోచన అని అన్నారు. విద్యారంగంలో వస్తున్న సమూల మార్పులపై చర్చించేందుకు జూలైలో రాయలసీమ జిల్లాల శిక్షణా తరగతులు మూడురోజుల పాటు మంత్రాలయంలో నిర్వహిస్తున్నామని,ఈ శిక్షణా తరగతులకు విద్యావేత్తలు, మేధావులు, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్ లు వస్తున్నారని,కావున విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని, ఈ మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల సహకరించాలని కోరుతున్నాము.కరపత్రాలు విడుదల చేసిన వారిలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మునిస్వామి, ఖాదర్,ఈరేష్, సమీర్, ఉదయ్ ,చాంద్, నరసింహ ,నాయుడు, వీరేష్, సురేష్, బాబు, రవి, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం

**తుగ్గలి**



జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని తుగ్గలి వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ జిట్టా నాగేష్ తెలియజేశారు. బుధవారం రోజున ఎర్రగుడి గ్రామంలోని సచివాలయం నందు ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించి, ప్రజలకు లబ్ధి చేకూర్చుట కొరకే జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని ఆయన తెలియజేశారు .ప్రతి ఒక్క వాలంటరీ ప్రతి ఇంటికి వెళ్ళి వారికి సంక్షేమ పథకాలు పొందారో లేదో తెలుసుకొని,వారి సమస్య ఏమైనా ఉంటే జూలై 19వ తేదీ లోపు వరకు మీ వార్డు నందు సమస్యలు అన్ని ఇచ్చి, మీ మొబైల్ నందు సర్వే కంప్లీట్ చేయాలని వాలంటీర్లకు ఆయన తెలియజేశారు. వాలంటీర్లకు వచ్చిన సమస్యలకు టోకెన్లు తయారు చేయాలని ఆయన తెలియజేశారు. ప్రజల సమస్య పరిష్కారం కొరకు 20వ తేదీన అధికారులు నేరుగా వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఆయన తెలియజేశారు.గ్రామ పంచాయతీ నందు ఎలాంటి సమస్యలు లేకుండా చేయడానికే జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టామని ఆయన తెలియజేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కొరకు మన నియోజకవర్గ శాసన సభ్యురాలు శ్రీదేవి ప్రత్యేక శ్రద్ధ చూపి స్పందిస్తున్నారని,కావున 20వ తేదీ లోపు అధికారులు ప్రజల సమస్యలు పరిష్కారం కొరకు కృషి చేయాలని వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ, సచి వాలయం అధికారులు, గ్రామ వాలంటీర్లు, వైయస్సార్సీపి నాయకులు, సచివాలయ కన్వీనర్లు ,గృహసారతులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ పాలనను చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

**కోరుట్ల**



ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ ,అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ లో చేరడానికి చాలామంది ఆసక్తి చూపుతున్నారని కోరుట్లఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు.బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు బీజేపీ ముఖ్య నాయకులు, మూడో వార్డు బీజేపీ అభ్యర్థిగా గత కౌన్సిలర్ ఎన్నికల్లో పోటీ చేసిన దొబ్బల వెంకటేష్, బీజేపీ మైనార్టీ మోర్చా అధ్యక్షులు ఎస్కే వాజీద్ తోపాటు 30 మంది ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ లో చేరారు..వారి వెంట అన్వర్, సంజయ్,రాజేశం,పవన్, చింటూ, రమేష్ నాయక్, విజయ్, నరహరి, ముఖేష్, మనోజ్, ఉదయ్, అజయ్, భువన్, ప్రణయ్, మాధవ్, ఫాహద్, హాఖిల్ బీజేపీ నాయకులు పార్టీని వీడి బీఆర్ఎస్ లో చేరారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరుతున్నారన్నారు.బిఆర్ఎస్ పార్టీని బలోపితం చేసి రానున్న రోజుల్లో కోరుట్ల అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.. ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఘనమైన విజయం కోసం కోరుట్ల అభివృద్ధి కోసం పనిచేయాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో కోరుట్ల బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అన్నం అనిల్, మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, మూడో వార్డు కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, మైనార్టీ అధ్యక్షులు ఫహీమ్, ఇతర కౌన్సిలర్లు, సర్పంచులు సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# మున్సిపల్ స్థలాలను కాపాడాలి-కార్మికులకు జీవనాధారం కల్పించాలి

**నందికొట్కూరు**



మున్సిపాలిటీ పరిధిలోని పాండురంగ స్వామి దేవాలయం ఎదురుగా ఉన్న మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని అదే స్థలంలో గతంలో మెకానిక్ షెడ్లు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న కార్మికులకు షెడ్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేయడం జరిగింది, ఈ ధర్నా కార్యక్రమానికి సిఐటియు పట్టణ కార్యదర్శి టి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగింది, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పకీర్ సాహెబ్ మాట్లాడుతూ, నందికొట్కూరు పట్టణంలో ప్రభుత్వ స్థలాలు యదేచ్చగా ఆక్రమణకు గురి అవుతున్నప్పటికీ కాపాడాల్సిన అధికారులు ప్రజాప్రతినిధులు కుమ్మక్కై ఆక్రమణదారులకు కొమ్ము కాయడం సూచనీయమన్నారు, గతంలో పాండురంగయ్య స్వామి దేవాలయం నిర్మాణానికి గతంలో ప్రభుత్వ భూమిని కేటాయించడం జరిగిందని అందులోనే దేవాలయం నిర్మించుకొని పూజ కార్యక్రమాలు చేసుకుంటున్నారు అన్నారు అయితే ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో బైక్ మెకానిక్ ,గ్యాస్ వెల్డింగ్, ఎలక్ట్రీషన్ ,తదితర వాహనాలు మెకానిక్ లు మున్సిపాలిటీకి పన్నులు చెల్లిస్తూ జీవన కొనసాగించేవారు, ఇటీవల సిసి రోడ్డు నిర్మాణం పేరుతో కార్మికుల షెడ్లను తొలగించడం అన్యాయం అని వారు ఆరోపించారు, దేవాలయం ఆదాయం కోసం ఎదురుగా ఉన్న స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం తగదన్నారు, మున్సిపల్ అధికారులే ఆ స్థలంలో షెడ్లు నిర్మించుకున్న కార్మికులకు పట్టాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు ,అనంతరం మున్సిపల్ కమిషనర్ కిషోర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వేణుగోపాల్, మెకానిక్ కార్మికులు సర్వేశ్వరుడు , తమన్, షేక్షావలి, మన్సూర్, షబ్బీర్, గోపాల్, రాజు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి రఘువీరా ఆధ్వర్యంలో 85 మందికి సామూహిక సీమంతాలు

**అనంతపురం**

నీలకంఠాపురం గ్రామంలో రఘువీరా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నీలకంఠా పురం పీహెచ్సీలో 85 మంది గర్భిణులకు సామూహిక సీమంత మహోత్సవం నిర్వహించారు..వారి అందరితో కలిసి రఘువీర కోడలు దీక్షిత కు కూడా అక్కడే వారితో పాటు శ్రీమంతం చేయడం జరిగింది.వచ్చిన గర్భిణీ లకు వారందరికీ సాంప్రదాయబద్ధంగా పండ్లు, పూలు, బేబీ కిడ్స్ పంపిణీ చేసి ఆశీర్వదించారు రఘువీరా.ఈ సందర్భంగా రఘువీరా కోడెల దీక్షిత అమిత్ రఘువీరా మాట్లాడుతూ గర్భిణీలు బలమైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు .తద్వారా పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తహీనత గర్భిణీలకు ఒక సవాల్గా మారిందని, దీనిని అధిగమించాలన్నారు. వారం వారం వైద్యులతో తనిఖీలు నిర్వహించుకోవాలన్నారు. వారి సూచనలు పాటించాలన్నారు. నాతో పాటు కులమత భేదాలు లేకుండా ఇంతమంది తో పాటు నాకు కూడా ఇక్కడే సామూహికంగా సీమంతాలు నిర్వహించడం చాలా సంతోషం అని అన్నారు రఘువీరా కోడలు దీక్షిత. అనంతరం వారితో పాటు భోజనం చేసి గర్భిణీ స్త్రీలు తిని వదిలేసిన ఇస్తరాకులను రఘువీరా తీసివేసారు.

# పాతబస్తీ బోనాలకు అన్నీ ఏర్పాట్లు

**హైదరాబాద్**



వచ్చే నెల 16 వ తేదీన జరిగే ఓల్డ్ సిటీ ఆషాడ బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం 250 కోట్ల రూపాయల వ్యయంతో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. బుధవారం సాలార్జంగ్ మ్యూజియంలో ఓల్డ్ సిటీ బోనాల నిర్వహణ, ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్న ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు. బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఎన్నో సంవత్సరాల నుండి గత ప్రభుత్వాలకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే ముఖ్యమంత్రి కేసిఆర్ రాష్ట్ర పండుగగా ప్రకటించారని, నాటి నుండి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తూ ఘనంగా నిర్వహిస్తూ వస్తుందని వివరించారు. గొప్పగా బోనాల ఉత్సవాలను జరుపుకోవాలనే ఉద్దేశంతో వివిధ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించేందుకు గాను ప్రభుత్వం 15 కోట్ల రూపాయలను విడుదల చేసిందని వివరించారు. ప్రైవేట్ దేవాలయాలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణా మాత్రమేనని చెప్పారు. బోనాల ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, ఎలాంటి ఆటంకాలు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లను చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రశాంతమైన వాతావరణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు జరిగేలా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం అఅ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇతర జిల్లాల నుండి అదనపు పోలీసు బలగాలను బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం రప్పించడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా భక్తులు, వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయడం జరుగుతుందని అన్నారు. వివిధ ఆలయాల వద్ద భక్తుల తోపులాటలు జరగకుండా భారికేడ్ లను ఏర్పాటు చేయడం జరుగుతుందని, అదేవిధంగా విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా అదనపు ట్రాన్స్ ఫార్మర్ లు, జనరేటర్ లను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. భక్తులకు త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆలయాల వద్ద ఎక్కడా సీవరేజ్ లీకేజీ లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఖీఅ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుందని అన్నారు. రహదారుల మరమ్మతులు, వాటర్, సీవరేజ్ లైన్ వంటి అభివృద్ధి పనులు ఏమైనా ఉంటే వచ్చే నెల 13 వ తేదీ లోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆలయ పరిసరాలు, కాలనీలు, రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా తొలగించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నిరంతర పారిశుధ్య నిర్వహణ కోసం అదనపు శానిటేషన్ సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాలలో స్ట్రీట్ లైట్ లు వెలిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# పెన్షనర్ల సమస్యల పరిష్కారంకు మంత్రి హరీష్ రావు హామీ

**జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్**

**జగిత్యాల**

పెన్షనర్ల సమస్యల పరిష్కారంకు ఆర్థిక మంత్రి హరీష్ రావు తమ తెలంగాణ పెన్షనర్స్ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో కలిసిన రాష్ట్ర,జిల్లాల ప్రతినిధులకు హామీ ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ తెలిపారు.బుధవారం మంత్రి హరీష్ రావును హైదరాబాద్ లో కలిసి వినతిపత్రమిచ్చారు. రాష్ట్రంలో దాదాపు మూడు లక్షల మంది పెన్షనర్లకు,9 లక్షల మంది కుటుంబ పెన్షనర్లకు ప్రయోజనం కల్పించేలా పీఆర్సీని ఏర్పాటు చేయాలని,గత పీఆర్సీ సిఫార్సు మేరకు ఆరోగ్య ట్రస్ట్ ను నెలకొల్పాలని,వెల్ నెస్ సెంటర్లు లేని అన్ని జిల్లాల కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని,అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదురహిత వైద్య సేవలు అందించాలని,నెల నెలా మొదటి తేది నే పెన్షన్ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయించాలని,ఇంకా రావాల్సిన డి.ఏ లు రెండు సైతం విడుదల చేయాలని,ప్రత్యేక ప్రోత్సాహకము మంజూరు చేయాలని తదితర సమస్యలు పరిష్కరించాలని,వచ్చే నెల ఒకటి నుంచి మధ్యంతర భృతి ఇవ్వాలని కోరామన్నారు. వీలయినంత త్వరలో సమస్యల పరిష్కారం కు హామీ ఇచ్చారని తెలిపారు.గత పీఆర్సీ సిఫార్సు మేరకు పెన్షనర్ల అంత్యక్రియల ఖర్చులు రూ.20 వేలు నుంచి రూ.30 వేల కు పెంచినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవనీత రావు,కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రేమ్ కుమార్,కోశాధికారి శ్రావణ్ కుమార్,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రాములు,కరీంనగర్,జగిత్యాల జిల్లాల అధ్యక్షులు కేశవరెడ్డి,హరి ఆశోక్ కుమార్,జిల్లాల కార్యదర్శులు లింగయ్య ,బొల్లం విజయ్,గౌరిశెట్టి విశ్వనాథం, పి.సి.హన్మంత్ రెడ్డి,ఎం.డి. యాకూబ్, బి.కరుణ, తదితరులు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గంలో పసుపు జెండా ఎగురవేయాలి

**శ్రీకాకుళం**

వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుని జెండా ఎగురు వేయడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి గుండ అప్పలనార్యనారాయణకోరారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 1985లో జరిగిన ఎన్నికలలో తొలిసారి తనకి అభ్యర్థిగా నిర్ణయం తీసుకోవడం జరిగిందని తొలి ఎన్నికల్లోనే తనకు 35000 పైచిలుక మెజార్టీ వచ్చిందని ఇది రాష్ట్రంలోనే రికార్డు స్థాయి మెజారిటీ అని ప్రత్యర్థి కూడా ప్రముఖులే అని అయినప్పటికీ శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీ సత్తాన్ని నిరూపించారని ఇది రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీ ఇచ్చిన కొద్ది నియోజకవర్గాల్లో ఇదిఒకటి అని తెలియజేశారు. ఈ విజయం నా వ్యక్తిగత ఖాతాలో వేసుకోనని అది తెలుగుదేశం పార్టీ బలమని అదే విషయం ప్రస్తుత వైసిపి నాయకులు ధర్మాన ప్రసాద్ రావు కూడా అనేక సందర్భాల్లో తన కార్యకర్తలకు తెలియజేసిన సందర్భాలు ఉన్నాయని తెలియజేశారు. ఇదే విషయం నిన్న శ్రీకాకుళం కేంద్రానికి సమీపంలో ఉన్న పెద్దపాడు, తంగివానిపేట, వానవానిపేట, శాస్త్రులపేట లో నాకెప్పుడూ మెజార్టీ రాలేదు అనడం వెనుక తెలుగుదేశం పార్టీ బలంగా ఉందనే భావనగా అర్థం చేసుకోవచ్చు.ఈ విజయ పరంపర 20 ఏళ్ళు కొనసాగిందని అయితే పార్టీలో గ్రూపులు పెట్టడం వలన నేను రాజకీయంగా మరుగున పడ్డానని తెలియజేశారు.ఇదే నియోజకవర్గంలో అందరూ కలిసి పనిచేసిన సందర్భంలో గుండ లక్ష్మీదేవి ధర్మాన ప్రసాదరావు మీద సుమారు 25000 మెజార్టీతో గెలిచిన సందర్భం ఉందని అందుకే సంయమనంగా మా దంపతులు వ్యవహరిస్తున్నామని తెలియజేశారు.

# మళ్లీ బుల్లితెరపై రామాయణ్



1980ల్లో దర్శకనిర్మాత రామానంద్ సాగర్ రూపొందించిన రామాయణం టీవీలో ప్రసారమై కొన్నేళ్ల పాటు ప్రేక్షకులను అమితంగా అలరించింది. ఆ మధ్య కరోనా సమయంలో మరోసారి ప్లే చేశారు కూడా. తాజాగా మరోసారి టీవీల్లో ప్రసారం అయ్యేందుకు సిద్ధమవుతోంది రామానందసాగర్ రామాయణం. ఆదిపురుష్ అనే పౌరాణిక డ్రామా విపత్తు నుంచి 'నేషనల్ డిటాక్స్' కోసం రామానంద్ సాగర్ జీ రామాయణాన్ని తిరిగి ప్రసారం చేయాలన్న ఓ నెటిజన్ కోర్కె మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారట. అరుణ్ గోవిల్ - దీపికా చిక్లియా నటించిన రామాయణం జూలై 3 న సాయంత్రం 7:30 గంటలకు షో ప్రసారం ప్రారంభం కానుంది. రామాయణం కథ ఆధారంగా రీసెంట్ గా తెరకెక్కిన ఆదిపురుష్ పై విమర్శలు వెల్లువెత్తాయి. కొందరికి రాముని లుక్ నచ్చకపోగా, మరికొందరికి హనుమంతుని భాష నచ్చలేదు. ఇంకొందరు అభిమానులకు రావణుడి ఆహార్యంమే నచ్చలేదు. కొన్ని సన్నివేశాలపైనా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. రామానందసాగర్ రామాయణంలో రాముడి పాత్ర పోషించిన అరుణ్ గోవిల్ కూడా తన అభిప్రాయం వ్యక్తం చేశాడు. రామాయణం భారతీయ సంస్కృతికి ప్రతిబింబమని, రామాయణ కథను, రాముని స్వరూపాన్ని మార్చి చూపించాల్సిన అవసరం లేదన్నారు. రామాయణాన్ని ఆధునికమని, సంప్రదాయమని విడదీయడం తగదన్నారు అరుణ్ గోవిల్. ఇక నెటిజన్ల విమర్శల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. సోషల్ మీడియా వేదికగా చీల్చి చెండాడేశారు. ఇలాంటి టైమ్ లో ఓ నెటిజన్ ట్వీట్ వైరల్ అయింది. 'ఆదిపురుష్' అనే పౌరాణిక డ్రామా విపత్తు నుంచి 'నేషనల్ డిటాక్స్' కోసం రామానంద్ సాగర్ జీ రామాయణాన్ని తిరిగి ప్రసారం చేయడం ప్రారంభించాలి అని కోరాడు. ఆ కోరిక ఇప్పుడు నెరవేరింది. జూలై 3 సాయంత్రం 7:30 గంటలకు షో ప్రసారం ప్రారంభం కానుంది. మేకర్స్ టీవీ షో నుంచి ఒక చిన్న క్లిప్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసి... "ప్రపంచ ప్రఖ్యాత పౌరాణిక సీరియల్ రామాయణం అభిమానులందరి కోసం మా ప్రేక్షకుల కోసం తిరిగి వచ్చింది. జూలై 3, రాత్రి 7.30 నుంచి మీ ఇష్టమైన ఛానెల్ షెమరూలో చూడండి." అని పోస్ట పెట్టారు నిర్వాహకులు. ఈ పోస్ట్ పెట్టిన వెంటనే కామెంట్స్ బాక్స్ నిండిపోయింది. ఆ మధ్య కరోనా సమయంలో సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ దూరదర్శన్‌లో పౌరాణిక ధారావాహికను తిరిగి ప్రసారం చేయమని కోరిన తర్వాత కూడా ప్రసారం అయింది. తాజాగా జూలై 3 సోమవారం నుంచి ఆదివారం వరకు రాత్రి 7:30 గంటలకు షెమరూ టీవీలో ప్లే కానుంది. దీపిక చిక్లియా ఇన్ స్టాలో ఇటీవల ఒక వీడియోను షేర్ చేసారు. నమస్కార్ నేను ఈ వీడియోను రూపొందించాలని చాలా కాలంగా అనుకుంటున్నాను. కానీ ఆదిపురుష్ గురించి మాట్లాడకూడదని అనుకున్నాను. నేను ఇంకా సినిమా చూడలేదు కాబట్టి దానిపై వ్యాఖ్యానించడానికి ఇష్టపడను. కానీ భవిష్యత్తు గురించి మాట్లాడతాను. సంవత్సరాలుగా సినిమాలు లేదా టీవీ సీరియల్ లలో ఆధునిక రామాయణం అద్భుతంగా రూపొందింది. భారతీయులమైన మనకు రామాయణం మనదైన పౌరాణిక గాధ కాబట్టి ఇకపై రీమేక్ లు చేయడం మానేయాలని నేను భావిస్తున్నాను. అన్నది ఆ వీడియో సారాంశం . 'ఆదిపురుష్' పై వచ్చిన విమర్శల్ని దృష్టిలో పెట్టుకుని రామానంద్ సాగర్ రామాయణం నటి దీపిక చిక్లియా ఇలా అన్నారు.



# విజయ్ ఆంటోనీ హత్య జులై 21న విడుదల

బిచ్చగాడు 2 సినిమా తో బ్లాక్బస్టర్ హిట్ కొట్టిన విజయ్ ఆంటోనీ, మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిదంగా ఉన్నారు. విజయ్ ఆంటోనీ నటిస్తున్న కొత్త సినిమా 'హత్య', ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో డిటెక్టివ్ పాత్రలో విజయ్ ఆంటోనీ కనిపించనున్నారు. హీరోయిన్ రితికా సింగ్ ఓ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా ట్రైలర్ ఇప్పటికే ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఈ రోజు దర్శకనిర్మాతలు సినిమా విడుదల తేదీ ని ప్రకటించారు. జులై 21 న ఈ సినిమా థియేటర్స్ లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. కంప్లీట్ మేక్ ఓవర్ తో, కొత్త లుక్ తో, చూడటానికి చాలా కొత్తగా ఉన్నారు విజయ్ ఆంటోనీ. ఎప్పుడూ కూడా కొత్త కథలతో, భిన్నమైన కాన్సెప్ట్ లతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు విజయ్.

లోటస్ పిక్చర్స్ తో కలిసి ఇన్ఫినిటీ ఫిలిం వెంచర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి కమల్ బోరా, జి.ధనుంజయన్, ప్రదీప్ బి, పంకజ్ బోరా, విక్రమ్ కుమార్, తాన్ శ్రీ దొరైసింగమ్ పిల్లై, సిద్ధార్థ్ శంకర్, ఆర్వీఎస్ అశోక్ కుమార్ నిర్మాతలు కాగా బాలాజీ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ఇతర కీలక పాత్రల్లో మురళీ శర్మ, జాన్ విజయ్, రాదికా శరత్‌కుమార్, సిద్ధార్థ శంకర్, అర్జున్ చిదంబరం, కిషోర్ కుమార్, సంకిత్ బోరా తదితరులు నటిస్తున్నారు

శివకుమార్ విజయన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా..ఆర్‌కె సెల్వ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గిరీష్ గోపాల కృష్ణన్ సంగీతం సమకూరు స్తున్నారు.

# 'సౌండ్ పార్టీ' టైటిల్ లోగో లాంచ్



ఫుల్ మూన్ మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై తొలి ప్రయత్నంగా బిగ్ బాస్ - 5, టైటిల్ విన్నర్, వి.జె.సన్నీ హీరోగా, హ్రితిక శ్రీనివాస్ హీరోయిన్ గా నటిస్తున్న నూతన చిత్రం 'సౌండ్ పార్టీ'. దర్శకుడు జయశంకర్ సమర్పణలో టాలెంటెడ్ రైటర్ 'సంజయ్ శేరి' ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ చిత్రం నేటితో షూటింగ్ విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా సారథి స్టూడియోలో ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ లోగో పోస్టర్ ను జర్నలిస్ట్ ల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

'సౌండ్ పార్టీ' లోగో ఆవిష్కరించిన అనంతరం ప్రముఖ జర్నలిస్ట్ వై.జె రాంబాబు మాట్లాడుతూ..."మంగళవారం సన్నీ ఏదో పార్టీ పెట్టబోతున్నా అంటూ ఒక వీడియో షేర్ చేసి...అందర్నీ షాక్ కి గురి చేశాడు. కానీ ఈ రోజే తెలిసింది అది తన సినిమా టైటిల్ సౌండ్ పార్టీ అని. జర్నలిస్ట్ గా, యాంకర్ గా, బిగ్ బాస్ విన్నర్ గా ఒక్కోమెట్టు ఎదుగుతూ హీరోగా మంచి సినిమాలు చేస్తూ వస్తున్నాడు. సిల్వర్ స్క్రీన్ పై ఈ సినిమాతో ఇంకా సౌండ్ చేయాలని కోరుకుంటూ. టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ " అన్నారు.

మరో జర్నలిస్ట్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ..."జర్నలిస్ట్ గా మొదలైన సన్ని కెరీర్ దినదినాభివృద్ధి చెందుతూ ముందుకెళుతోంది. ఈ సినిమాతో తను సిల్వర్ స్క్రీన్ పై మరింత సౌండ్ చేయాలని కోరుకుంటూ యూనిట్ అందరికీ శుభాకాంక్షలు" అన్నారు.

చిత్ర సమర్పకుడు వి. జయశంకర్ మాట్లాడుతూ..."నిర్మాత రవి గారు నేను మంచి మిత్రులం. తను నాతో ఒక సినిమా చేయాలని వచ్చారు. కానీ అప్పటికే నేను మరో ప్రాజెక్ట్ లో బిజీగా ఉన్నాను. అందువల్ల నా చిరకాల మిత్రుడైన సంజయ్ తో సినిమా చేయమన్నాను. అలా ప్రారంభమైందే ఈ సినిమా. ఎక్కడా ప్రాబ్లమ్ రాకుండా అనుకున్న విధంగా , అనుకునన్న సమయానికి సంజయ్ సినిమా పూర్తి చేశాడు. అనుకున్న ప్రకారం ఆగస్ట్ లో సినిమాను గ్రాండ్ గా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం" అన్నారు.

# 'కీడా కోలా' టీజర్ విడుదల



ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మోస్ట్ ట్యాలెంటెడ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ క్రైమ్ కామెడీ 'కీడా కోలా' టీజర్ విడుదలైంది. మేకర్స్ గతంలో హ్యూమరస్ పోస్టర్ల ద్వారా సినిమాలోని 8 ప్రధాన పాత్రలను పరిచయం చేశారు. ఒక కోలా బాటిల్ లో ఎదో కదులుతూ వుంటుంది. అది ఏంటని బ్రహ్మానందం అడిగితే? చైతన్యరావు ద్రాక్ష అని చెబుతాడు. ఇద్దరి మధ్య సెటైరికల్ పంచ్‌లతో టీజర్ హిలేరియస్ గా మొదలౌతుంది. తర్వాత గ్యాంగ్ ఆఫ్ మిస్‌ఫిట్స్ యాక్షన్ లోకి దిగడం ఇంకా ఆసక్తికరంగా వుంది. టీజర్ సినిమాలోని పాత్రలు, వారి వరల్డ్ ని పరిచయం చేసింది. టీజర్ చాలా ఆసక్తికరంగా ఉంటూ తర్వాత వచ్చే ప్రమోషనల్ మెటీరియల్ పై క్యురియాసిటీని పెంచింది. టీజర్‌లో కామెడీ బ్రహ్మ బ్రహ్మానందం వినోదాత్మక పాత్రలో కనిపించగా, తరుణ్ భాస్కర్ లోకల్ డాన్‌గా కనిపించడం సర్‌ప్రైజ్ చేసింది. చైతన్య రావు మాదాడి, రఘు రామ్, రవీంద్ర విజయ్, జీవన్ కుమార్, విష్ణు, రాగ్ మయూర్ ఇతర ముఖ్య తారాగణం. ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంది. కీడా కోలా విజి సైన్మా మొదటి ప్రొడక్షన్. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్ నందూరి, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎజె ఆరోన్ సినిమాటోగ్రఫీ, వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆకట్టుకున్నాయి. ఉపేంద్ర వర్మ ఎడిటర్, ఆశిష్ తేజ పులాల ఆర్ట్ డైరెక్టర్. తరుణ్ భాస్కర్ స్క్రిప్ట్ రాశారు. కీడా కోలా షూటింగ్ పూర్తి చేసుకొని పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. త్వరలో విడుదల తేదీని మేకర్స్ అనౌన్స్ చేస్తారు.

తారాగణం: బ్రహ్మానందం, రఘు రామ్, రవీంద్ర విజయ్, జీవన్ కుమార్, విష్ణు, తరుణ్ భాస్కర్, చైతన్య రావు మదాడి, రాగ్ మయూర్ తదితరులు

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950